టీడీపీ కూటమి అధికారంలోకి రావడంతో వైసీపీ నేతృత్వం వహిస్తున్న స్థానిక సంస్థల పీఠాలు కదులుతున్నాయి. ఎంపీపీ, మున్సిపల్ చైర్మన్ పదవుల్లో ఉన్న వైసీపీ నాయకులు.. అసమ్మతిని ఎదుర్కొనేందుకు తంటాలు పడుతున్నారు. పార్టీ అధికారంలో ఉన్నా తమ పనులు జరగకపోవడం, నిధులు, బిల్లుల విషయంలో వివక్ష చూపడంతో వైసీపీకి చెందిన కొందరు రగిలిపోతున్నారు. ఎంపీటీసీలు, కౌన్సిలర్లలో కొందరు ఇప్పటికే టీడీపీలో చేరిపోయారు. మరికొందరు అవకాశం కోసం ఎదురు చూస్తున్నారు. అవిశ్వాసం పెట్టి పదవి నుంచి దించేందుకు నాలుగేళ్ల నిబంధన ఉన్నా.. ఇక తమ పదవి దినదిన గండమేనని పలువురు ఎంపీపీలు ఆందోళన చెందుతున్నారు. కళ్యాణదుర్గం నియోజకవర్గంలోని కంబదూరు, బ్రహ్మసముద్రం, గుంతకల్లు నియోజకవర్గంలోని పామిడిలో ఇదే పరిస్థితి నెలకొంది.

కదులుతున్న కుర్చీలు!

ఎంపీపీలపై వైసీపీ ఓటమి ప్రభావం

- టీడీపీ, బీజేపీ వైపు ఎంపీటీసీల చూపు
- బుజ్జగింపులకు దిగిన పామిడి ఎంపీపీ
- కంబదూరు, బ్రహ్మసముద్రంలో ఒప్పందం గొడవ
- ఉషశ్రీ చరణ్ వలస..
- పట్టించుకోని తలారి రంగయ్య


మురళీమోహన్ రెడ్డి, ఎంపీపీ పామిడి



పామిడి/కళ్యాణదుర్గం, జూలై 3: పామిడి ఎంపీపీ భోగాతి మురళీ మోహన్ రెడ్డికి అసమ్మతి సెగ తగులుతోంది. ఆయనకు వ్యతిరేకంగా వైసీపీకి చెందిన పలువురు ఎంపీటీసీలు పావులు కదుపుతున్నారు. వైస్ ఎంపీపీ కాయల మహేశ్ ఇటీవలే టీడీపీలో చేరారు. మండలంలో మొత్తం 14 ఎంపీటీసీ స్థానాలు ఉన్నాయి. పామిడి నగర పంచాయతీగా ఏర్పడడంతో గ్రామీణ ప్రాంతాలలోని ఎనిమిది ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు జరిగాయి. ఇందులో ఎదురూరు, గజరాంపల్లి, దేవరపల్లి, ఖాదర్‌పేట, రామగిరి, పాళ్యం తండా, ఎద్దులపల్లి, వంకరాజుకాలువ స్థానాలు ఉన్నాయి. ఎదురూరు స్థానం నుంచి వైసీపీ అభ్యర్థి భోగాతి మురళీ మోహన్‌రెడ్డి ఏకగ్రీవం అయ్యారు. వైసీపీ అధికారంలో ఉండటంతో టీడీపీ వర్గీయులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అప్పటి పరిస్థితుల దృష్ట్యా ఎంపీటీసీ ఎన్నికల బరి నుంచి తప్పుకుంటున్నామని టీడీపీ అధినాయకత్వం ప్రకటించింది. దీంతో వైసీపీ అభ్యర్థులు సునాయాసంగా విజయం సాధించారు.


అప్పట్లో ఏకగ్రీవ ఎన్నిక పత్రం అందుకుంటున్న భోగాతి మురళీమోహన్‌రెడ్డి

అయినా వదల్లేదు..

● టీడీపీ అధినాయకత్వం వద్దన్నా.. ఆ పార్టీకి చెందిన కొందరు తెగింపు ప్రదర్శించారు. ఎంపీటీసీ ఎన్నికల్లో విజయం సాధించారు. వీరిలో వంకరాజుకాలువ ఎంపీటీసీ ఎల్.సువర్ణ ఒకరు. ఆమె వైసీపీ అభ్యర్థి ఎం.జయమ్మపై 424 ఓట్ల మెజార్టీతో గెలిచారు. ఎద్దులపల్లి స్థానంలో వైసీపీ అభ్యర్థి చుక్కలూరు రామకృష్ణారెడ్డిపై బీజేపీ సీనియర్ నాయకుడు గండికోట సుధాకరశర్మ స్వతంత్ర అభ్యర్థిగా బరిలో దిగి.. అనూహ్యంగా 220 ఓట్ల మెజార్టీతో గెలిచారు. గజరాంపల్లిలో టీడీపీ అభ్యర్థి సిరిచాటి రామలక్ష్మిపై వైసీపీ అభ్యర్థి రంగమ్మ 871 ఓట్ల మెజార్టీతో గెలిచారు. కానీ సర్పంచుగా కూడా రంగమ్మ గెలవడంతో.. ఎంపీటీసీ పదవిని వదులుకున్నారు. ఉప ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థి గవ్వల ఆదిలక్ష్మిపై టీడీపీ అభ్యర్థి సిరిచాటి రామలక్ష్మి 202 ఓట్ల మెజార్టీతో గెలిచారు.

● వైసీపీ అభ్యర్థులు ఖాదర్‌పేటలో కాయల మహేష్, పాళ్యంతండాలో నీలాబాయి, రామగిరిలో ఎం.రాజశేఖర్, దేవరపల్లిలో నక్కా సౌభాగ్య గెలిచారు. ఇలా.. మొత్తం ఎనిమిదింటిలో ఐదు వైసీపీ, రెండు టీడీపీ, ఒక స్వతంత్ర ఎంపీటీసీలు ఉన్నారు. వీరిలో వైస్ ఎంపీపీ కాయల మహేష్ టీడీపీలోకి చేరడంతో వైసీపీ బలం నాలుగుకు తగ్గింది. టీడీపీ బలం మూడుకు చేరింది. దీనికి తోడు స్వతంత్ర ఎంపీటీసీ అయిన బీజేపీ నాయకుడి మద్దతూ టీడీపీకే ఉంటుందని భావిస్తున్నారు. ఇలా ఇప్పటికే నలుగురేసి ఎంపీటీసీలతో తూకం సమంగా ఉంది. ఎక్స్ అఫీషియో హోదాలో ఎమ్మెల్యే, ఎంపీకి కూడా ఓట్లు ఉంటాయి. వైసీపీ నుంచి ఇంకొక ఎంపీటీసీ త్వరలో టీడీపీ గూటికి చేరుతారని ప్రచారం జరుగుతోంది. దీంతో ఎంపీపీ పదవిలో వైసీపీ నాయకుడు ఉన్నా.. ఏటికి ఎదురీత తప్పదని స్పష్టమౌతోంది.

అసంతుష్టులతో మంతనాలు


టీడీపీలోకి చేరిన వైస్ ఎంపీపీ కాయల మహేష్

అసంతృప్తితో రగిలిపోతున్న వైసీపీ ఎంపీటీసీలతో ఎంపీపీ భోగాతి మురళీమోహన్‌రెడ్డికి అనుకూలమైన నాయకులు మంతనాలు జరుపుతున్నారని తెలిసింది. వైసీపీకి చెందిన ఇద్దరు ఎంపీటీసీలకు పనుల మంజూరు, చేసిన పనులకు బిల్లులు ఇచ్చే విషయంలో ఎంపీపీ తీవ్రంగా ఇబ్బంది పెట్టారని ఆరోపణలు ఉన్నాయి. ఇదే విషయమై ఆ ఇద్దరు ఆవేదనను వ్యక్తంచేసినట్లు తెలుస్తోంది. అప్పట్లో ద్వేషించిన ఎంపీటీసీలపైనే ప్రస్తుతం ఎంపీపీ భవితవ్యం ఆధారపడి ఉండటం ఉత్కంఠ రేపుతోంది. ఆ ఇద్దరిని సంతృప్తి పరిచేందుకు తాయిళాలు సిద్ధం చేస్తున్నట్లు సమాచారం.

అంతా ఆమే చేశారు..!



వైసీపీ అధికారంలో ఉండటంతో అప్పటి మంత్రి ఉషశ్రీ చరణ్ నియంతృత్వ పోకడలకు పోయారు. పార్టీలో ఆమె ఏది చెబితే అది వినాల్సిన పరిస్థితి. ఇప్పుడు ఆమె ఇక్కడ లేరు. పార్టీ కూడా ఘోరంగా ఓడిపోయింది. దీంతో ఇన్నాళ్లూ అణచివేతకు గురైనవారు తిరుగుబాటుకు సిద్ధమయ్యారు. కంబదూరు, బ్రహ్మసముద్రం ఎంపీపీ పదవుల విషయంలో ఇప్పుడు ఇదే జరుగుతోంది. ఈ రెండు పీఠాలకు అప్పట్లో భారీగా పోటీ ఉన్నింది. దీంతో రెండున్నరేళ్ల చొప్పున రెండు వర్గాలవారు పంచుకునేలా అప్పటి మంత్రి ఒప్పించారు. మొదట పదవి తీసుకున్నవారు ఇప్పుడు దిగేందుకు ససేమిరా అంటున్నారు. ఒప్పంద కుదిర్చిన ఉష శ్రీచరణ్ స్థానంలో కళ్యాణదుర్గం నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా తలారి రంగయ్యకు బాధ్యతలు అప్పగించారు. సార్వత్రిక ఎన్నికల సమయంలోనే ఈ రెండున్నరేళ్ల గోల ఆయన దృష్టికి వెళ్లింది. ఎన్నికలలో ఓటమితో ఆయన నైరాశ్యంలో ఉన్నారు. 'అప్పట్లో ఏం ఒప్పందాలు జరిగాయో నాకేం తెలుసు..?' అన్నట్లుగా వ్యవహరిస్తున్నారని సమాచారం.

దిగుతారా..? దించేస్తారా..?


తిమ్మరాజమ్మ


చంద్రశేఖర్‌రెడ్డి

● కంబదూరు ఎంపీపీగా వాల్మీకి సామాజికవర్గానికి చెందిన తిమ్మరాజమ్మ ఉన్నారు. దీంతో అదే సామాజికవర్గానికి చెందిన తలారి రంగయ్య మౌనంగా ఉంటున్నారని విమర్శలు వస్తున్నాయి. అప్పట్లో కురుబ సామాజికవర్గానికి రావాల్సిన ఎంపీపీ పదవిని తన స్వార్థం కోసం ఉష శ్రీచరణ్ వాల్మీకులకు ఇచ్చారని వైరి వర్గంవారు మండిపడుతున్నారు. కురుబ సామాజికవర్గం నుంచి రాళ్ల అనంతపురం గ్రామానికి చెందిన లక్ష్మీదేవి ప్రస్తుతం ఎంపీపీ రేసులో ఉన్నారు. ఆమెకు 13 మంది ఎంపీటీసీలు మద్దతుగా ఉన్నారు.

● బ్రహ్మసముద్రం ఎంపీపీ చంద్రశేఖర్‌రెడ్డి పదవి నుంచి దిగే ప్రసక్తే లేదని తేల్చి చెబుతున్నారట. ఎంపీపీ పదవి కోసం నాటి మంత్రికి రూ.35 లక్షలు ఇచ్చానని ఆయన బహిరంగంగా చెబుతున్నారు. దీంతో ఒప్పందం ప్రకారం మిగిలిన రెండున్నరేళ్లపాటు ఎంపీపీ పదవిని ఆశిస్తున్న నాగిరెడ్డిపల్లి ఎంపీటీసీ కురుబ రేణుకమ్మ లోలోపలే మంతనాలు సాగిస్తున్నట్లు తెలుస్తోంది. బ్రహ్మసముద్రం మండల పరిధిలోని 10 మంది ఎంపీటీసీలు తనకు మద్దతు ఇచ్చేందుకు ముందుకు వస్తున్నారని ఆమె అంటున్నారు.

ఉండాలా..? పోవాలా..?


కురుబ రేణుకమ్మ


కురుబ లక్ష్మిదేవి

కంబదూరు, బ్రహ్మసముద్రం ఎంపీపీ పదవులను సెకెండ్ హాఫ్‌లో ఆశిస్తున్నది కురుబ సామాజికవర్గం నాయకులే. అప్పట్లో మంత్రి ఉష శ్రీచరణ్ చివరి రెండున్నరేళ్లు పదవులు ఇప్పిస్తానని నమ్మబలకడంతో ఒప్పుకున్నామని, ఇప్పుడు తమ పరిస్థితి ఏమిటని వారు నిలదీస్తున్నారు. కాలయాపన చేస్తే ఊరుకునేది లేదని హెచ్చరిస్తున్నారు. పట్టించుకోకపోతే పార్టీ మారేందుకూ సిద్ధమని తేల్చి చెబుతున్నారు. బ్రహ్మసముద్రం మండలంలో పది మంది ఎంపీటీసీలతో పాటు నాయకులు, కార్యకర్తలు టీడీపీలోకి చేరేందుకు ముమ్మర ప్రయత్నాలు సాగిస్తున్నట్లు తెలుస్తోంది. ఇదే జరిగితే ఆ మండలంలో వైసీపీ తుడిచిపెట్టుకుపోతుందని అంటున్నారు. కంబదూరు మండలానికి చెందిన ఎంపీటీసీలు కూడబలుక్కుని వైసీపీకి స్వస్తి పలికి, బీజేపీలోకి వెళ్లే ఆలోచనలో ఉన్నట్లు సమాచారం.



బొమ్మనహాళ్‌లోనూ ముసలం

ఎంపీపీ పద్మ రాజీనామాకు డిమాండ్

బొమ్మనహాళ్, జూలై 3: ఎంపీపీ పద్మ తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని వైసీపీకి చెందిన పలువురు ఎంపీటీసీ సభ్యులు డిమాండ్ చేశారు. ఉప్పరహాళ్ ఎంపీటీసీ ముల్లంగి నాగమణి స్వగ్రామం ఎల్‌బీ నగర్‌లో బుధవారం అసమ్మతి వర్గీయులు సమావేశం నిర్వహించారు. బొమ్మనహాళ్ ఎంపీటీసీ శివశరణమ్మ భర్త యువరాజు, ఉద్దేహాళ్ ఎంపీటీసీ భర్త కోటేశ్వరరెడ్డి, కొళగానహళ్లి ఎంపీటీసీ తిమ్మప్ప, నేమకల్లు ఎంపీటీసీ చిక్కణ్ణ, బండూరు ఎంపీటీసీ అమరేష్ తదితరులు హాజరై.. టీడీపీ నాయకుడు ముల్లంగి నారాయణస్వామితో చర్చించారు. ఎంపీపీ పద్మ తన పదవికి రాజీనామా చేసి బలనిరూపణ చేసుకోవాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులును కలిసి త్వరలో భవిష్యత్తు కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేసుకుంటామని అన్నారు. తన భార్య పదవిని అడ్డు పెట్టుకుని ఎంపీపీ పద్మ భర్త చంద్రశేఖర్‌రెడ్డి అనేక అక్రమాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. అందుకు ఎంపీపీ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తున్నామని అన్నారు. లేదంటే ఎంపీడీఓ కార్యాలయం ముందు ఆందోళన చేపడతామని హెచ్చరించారు. త్వరలో జరిగే మండల సర్వసభ్య సమావేశాన్ని కూడా బహిష్కరిస్తామని అన్నారు.

ఆ బడికి వెళ్లేదే లే..!

- గంగవరంలో ప్రాథమిక పాఠశాలకే 3, 4, 5 తరగతుల విద్యార్థులు
- విలీనం పేరిట హైస్కూల్‌కు పంపిన గత ప్రభుత్వం
- తల్లిదండ్రుల తిరుగుబాటు
- పట్టించుకోని విద్యాశాఖ అధికారులు


గంగవరం మెయిన్ ప్రైమరీ స్కూల్

అనంతపురం విద్య, జూలై 3: జగన్ ప్రభుత్వం తీసుకున్న అసంబద్ధ నిర్ణయంతో ప్రాథమిక పాఠశాలల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రాథమిక పాఠశాలల్లోని 3, 4, 5 తరగతులను ఉన్నత పాఠశాలల్లోకి విలీనం చేశారు. దీంతో కి.మీ. దూరం వెళ్లలేక కొందరు బడి మానేశారు. మరికొందరు ప్రైవేటు బాట పట్టారు. బెళుగుప్ప మండలంలోని గంగవరంలో సమస్య మరింత జటిలంగా మారింది. ఇక్కడ విలీనాన్ని వ్యతిరేకిస్తున్న తల్లిదండ్రులు.. 3, 4, 5 విద్యార్థులను ప్రాథమిక పాఠశాలకే పంపుతున్నారు. నాటి ప్రభుత్వ ఆదేశాల కారణంగా వీరికి పాఠాలు చెప్పాల్సిన ఉపాధ్యాయులు మాత్రం ఉన్నత పాఠశాలకే వెళుతున్నారు. దీంతో విద్యార్థులు ఇక్కడ.. గురువులు అక్కడ అన్నట్లుగా పరిస్థితి తయారైంది. విద్యాశాఖ అధికారులు ఈ సమస్యను పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది.

హైస్కూల్‌కు పంపేదే లేదు..

గంగవరం గ్రామంలోని ప్రాథమిక పాఠశాల(మెయిన్)లోని 3, 4, 5 తరగతులను నుంచి గంగవరం హైస్కూల్‌లో విలీనం చేశారు. ఈ మూడు తరగతుల విద్యార్థులు అక్కడికి వెళ్లాలంటే సుమారు 2 కి.మీ. దూరం ప్రయాణించాలి. దీంతో అప్పట్లోనే విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్థులు ఉద్యమించారు. అయినా అధికారులు మొండిగా ముందుకు వెళ్లారు. ప్రాథమిక పాఠశాల నుంచి విద్యార్థులను ఉన్నత పాఠశాలకు బదిలీ చేశారు. వేసవి సెలవుల తర్వాత పాఠశాలలు పునః ప్రారంభమయ్యాయి. తల్లిదండ్రులు తమ పిల్లలను హైస్కూల్‌కు పంపేది లేదని భీష్మించారు. మూడు తరగతుల విద్యార్థులు సుమారు 50 మంది ప్రాథమిక పాఠశాలకే వెళుతున్నారు. వారికి పాఠాలు చెప్పాల్సిన ఉపాధ్యాయులు మాత్రం ఉన్నత పాఠశాలలోనే ఉన్నారు.

బోధన ఎలా..?

గంగవరం ప్రాథమిక పాఠశాలలో (మెయిన్) ఒకటి, రెండు తరగతుల విద్యార్థులు సుమారు 25 మంది ఉన్నారు. వీరికి పాఠాలు చెప్పేందుకు ఇద్దరు ఉపాధ్యాయులు ఉన్నారు. తాజాగా 3, 4, 5 తరగతుల విద్యార్థులు 50 మంది వరకూ మళ్లీ ఇదే పాఠశాలకు వస్తున్నారు. దీంతో బోధన పరంగా ఉపాధ్యాయులు సమస్యలను ఎదుర్కొంటున్నారు. ఉన్నత పాఠశాల నుంచి ఉపాధ్యాయులను తిరిగి ప్రాథమిక పాఠశాలకు పంపితే తప్ప సమస్య పరిష్కారమయ్యేలా లేదు. తమ బిడ్డలను హైస్కూల్‌కు పంపేదే లేదని, అవసరమైతే ప్రైవేటు పాఠశాలల్లో చేరుస్తామని తల్లిదండ్రులు అంటున్నారు. ప్రాథమిక పాఠశాలకు వెంటనే ఉపాధ్యాయులను కేటాయించాలని డిమాండ్ చేస్తున్నారు. సమస్యను మంత్రి పయ్యావుల కేశవ్ దృష్టికి తీసుకువెళతామని తల్లిదండ్రులు అంటున్నారు.

దాచేశారు?

- 'ఆడుదాం ఆంధ్రా' కిట్లు మాయం ?
- వలంటీర్లు, వైసీపీ నాయకుల వద్దనే కిట్లు
- పట్టించుకోని మండల స్థాయి అధికారులు


ఆదర్శపాఠశాలలో క్రీడా సామగ్రిని పంపిణీ చేస్తున్న అధికారులు (ఫైల్)

తాడిపత్రి, జూలై 3: గత వైసీపీ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో భారీస్థాయిలో అవకతవకలు జరిగాయన్న ఆరోపణలు ఉన్నాయి. గ్రామస్థాయిలో పలువురు ఆటగాళ్ల ప్రతిభను వెలికితీసేందుకు నిర్వహించిన ఆడుదాం ఆంధ్రా కార్యక్రమం ఆర్భాటానికే పరిమితమైంది. నామమాత్రంగా క్రికెట్, వాలీబాల్, బ్యాడ్మింటన్, కబడ్డీ, ఖోఖో తదితర ఆటల పోటీలు నిర్వహించారు. ఇందుకోసం ఒక్కో సచివాలయానికి సుమారు లక్ష రూపాయలు పైన వెచ్చించి క్రీడా సామగ్రిని కొనుగోలు చేశారు. ఈ ఆట వస్తువులన్నీ కొందరు వలంటీర్లు, వైసీపీ నాయకుల ఇళ్ల వద్ద ఉన్నాయి. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా క్రీడా సామగ్రి సచివాలయాలకు చేరలేదు. కొన్ని గ్రామాల్లో ఈ కిట్లు మా ప్రభుత్వంలో వచ్చాయి. మేమెందుకు వెనక్కి ఇవ్వాలంటూ పలువురు వైసీపీ నాయకులు, వలంటీర్లు సంబంధిత పంచాయతీ కార్యదర్శులను దబాయిస్తున్నట్లు సమాచారం. సాధారణంగా ఆటలు నిర్వహించిన అనంతరం పంచాయతీ కార్యదర్శి సచివాలయంలోనే క్రీడాసామగ్రిని భద్రపరచాలనే నిబంధన ఉంది. కానీ అలా జరగలేదు. కనీసం సచివాలయాలకు ఏ ఆట వస్తువులు వచ్చాయో కూడా తెలియడం లేదు. మరికొన్నిచోట్ల మాకు తెలియదంటే మాకు తెలియదంటూ విద్యాశాఖ, పంచాయతీరాజ్‌శాఖ అధికారులు ఒకరిమీద ఒకరు చెప్పుకోవడం విమర్శలకు తావిస్తోంది.

మంజూరైన ఆడుదాం ఆంధ్రా కిట్లు

తాడిపత్రి పట్టణంతోపాటు రూరల్‌కి సంబంధించి 49 సచివాలయాలు ఉండగా 147క్రికెట్, వాలీబాల్ 49, షటిల్ బ్యాడ్మింటన్ కిట్లు 300, నీ క్యాప్స్ 300, హ్యాంకిల్ బ్రష్ 300, డ్రస్సులు 550 మంజూరయ్యాయి. వీటిలో ఒక్కో క్రికెట్ కిట్టుకు రూ.2వేల చొప్పున దాదాపు రూ.3లక్షలు, వాలీబాల్ రూ.1.5లక్షలు, షటిల్ బ్యాట్లకు రూ.4.4లక్షలు, మిగిలిన వాటికి రూ.5లక్షల మేర ఖర్చుచేశారు.

పెద్దపప్పూరు మండలంలో 24క్రికెట్ కిట్లకు రూ.50వేలు, వాలీబాల్ కిట్లకు రూ.లక్ష, బ్యాడ్మింటన్ రూ.50వేలు, మిగిలిన వాటికి రూ.లక్ష మేర ఖర్చుచేసి కొనుగోలు చేశారు.

● యాడికి మండలంలో 16 సచివాలయాలకు గాను 48 క్రికెట్ కిట్లకు రూ.లక్ష, వాలీబాల్ కిట్లు 48కిగాను రూ.1.5లక్షలు, ఖోఖో, షటిల్ తదితర వాటికి దాదాపు రూ.5లక్షలు ఖర్చుచేశారు.

● పెద్దవడుగూరు మండలంలో 15సచివాలయాలు ఉండగా 30క్రికెట్ కిట్లకు రూ.60వేలు, వాలీబాల్ కిట్లు 30కి గాను రూ.లక్ష, షటిల్‌బ్యాట్లు రూ.1.5లక్షలు మిగిలిన వాటికి రూ.5లక్షలు ఖర్చు పెట్టారు.

వలంటీర్ల వద్దే ఉన్నాయి



గత ప్రభుత్వం నిర్వహించిన ఆడుదాం ఆంధ్రా క్రికెట్ కిట్లు వలంటీర్లు, వైసీపీ నాయకుల వద్దే ఉన్నాయి. ప్రస్తుతం అవి ఎక్కడ ఉన్నాయో ఎవరికి తెలియడం లేదు. ఈ ప్రభుత్వంలోనైనా వాటి ఆచూకీ అధికారులు గుర్తిస్తే మాలాంటి ఆటగాళ్లు మరింత నైపుణ్యం సంపాదించే అవకాశం ఉంటుంది.

- కార్తీక్, క్రికెట్ క్రీడాకారుడు

పుట్లూరు, యల్లనూరు మండలాల్లో పత్తాలేని కిట్లు

ఆడుదాం ఆంధ్రా క్రీడాసామగ్రి కొనుగోలు చేసిన వివరాలను అధికారులు చెప్పకపోవడంపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. పుట్లూరు, యల్లనూరు మండలాలకు ఏ కిట్లు వచ్చాయో, అవి ఎక్కడ ఉన్నాయో తమకు తెలియదంటూ మండల స్థాయి అధికారులే చెప్పడం గమనార్హం. ఈ రెండు మండలాల్లో సర్పంచులు, ఎంపీపీలు ఎక్కువ భాగం వైసీపీ వారే ఉండటంతో ఆ గ్రామాల పరిధిలో వలంటీర్ల వద్దనే సామగ్రి ఉన్నట్లు సమాచారం. వాటిని అడిగేందుకు అధికారులు విముఖత చూపుతున్నారు. సచివాలయ సిబ్బంది వాటిని పట్టించుకున్న దాఖలాలు లేవు.

ఆ క్రీడా సామగ్రి గురించి తెలియదు



మండలంలో ఆడుదాం ఆంధ్రా క్రీడా సామగ్రి విషయం నాకు తెలియదు. మండలానికి ఎన్ని వస్తువులు వచ్చాయో అవి ఎక్కడ ఉన్నాయో కూడా నాకు తెలియదు. కొద్దిరోజులు తర్వాత విచారించి చెబుతా. ఏమైనా అవకతవకలు జరిగి ఉంటే చర్యలు తీసుకుంటాం.

- దస్తగిరి, ఎంపీడీఓ, పుట్లూరు మండలం

నెమలివరంలో ఇద్దరి కిడ్నాప్

వెంబడించి పట్టుకున్న గ్రామస్థులు


కిడ్నాపర్ల చేతిలో గాయపడిన హనుమంతరాయుడు

ధర్మవరం రూరల్(కనగానపల్లి), జూలై 3: కనగానపల్లి మండలం నెమలివరం గ్రామానికి చెందిన ఇద్దరిని అనంతపురం నగరానికి చెందిన కొందరు కిడ్నాప్ చేశారు. స్థానికులు గుర్తించి.. కిడ్నాపర్ల వాహనాన్ని వెంబడించి పట్టుకున్నారు. నిందితులను పోలీసులకు పట్టించారు. ఈ వ్యవహారం మండలంలో కలకలం రేపింది. యలకుంట్ల పంచాయతీ పరిధిలోని నెమలివరం గ్రామానికి చెందిన బొమ్మలాట హనుమంతరాయుడు, నరసింహులును అనంతపురం నుంచి వచ్చిన గుర్తుతెలియని వ్యక్తులు అపహరించారు. వారిని ఏపీ 04 ఏఎం 0972 ఇన్నోవా వాహనంలో తీసుకువెళుతుండగా గ్రామస్థులు అప్రమత్తమయ్యారు. వాహనాన్ని వెంబడిస్తూ.. ఆ మార్గంలో ముందున్న ఆత్మకూరు మండలం గొరిదిండ్ల గ్రామస్థులకు సమాచారం ఇచ్చారు. వారు ఇన్నోవా వాహనాన్ని అడ్డగించి, కిడ్నాపర్లను పట్టుకున్నారు. అనంతరం కనగానపల్లి పోలీసులు అక్కడికి చేరుకుని, కిడ్నాపర్లను అదుపులోకి తీసుకున్నారు. వారి చేతిలో గాయపడిన బొమ్మలాట హనుమంతరాయుడును అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అనంతపురం నగరానికి చెందిన కిడ్నాపర్లు నాగభూషణం, సాయికుమార్, మనోహర్, నారాయణస్వామి, రాఘవేంద్ర, దిలీప్‌కుమార్‌ను స్థానిక పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేస్తామని, కిడ్నాప్‌కు కారణమేమిటో విచారిస్తామని ఎస్ఐ మల్లికార్జునరెడ్డి తెలిపారు. పెనుకొండ సమీపంలోని ఓ గ్రామానికి చెందిన మహిళతో నెమలివరం గ్రామానికి చెందిన చిరంజీవి అనే వ్యక్తి వివాహేతర సంబంధం పెట్టుకున్నారని, ఆ మహిళ కుటుంబ సభ్యులే కిడ్నాప్ వ్యవహారం వెనుక ఉన్నారని గ్రామస్థులు అంటున్నారు.


పోలీసుల వాహనంలో కిడ్నాపర్లు

ఓపెన్ సీక్రెట్..!

పంచాయతీ స్థలాన్ని ఆక్రమించిన ఉద్యోగి

గతంలో లే అవుట్ వేసింది ఆయనే..


ఓపెన్ సైట్

అనంతపురం రూరల్, జూలై 3: ఆయనో రెవెన్యూ ఉద్యోగి. అనంతపురం అర్బన్ తహసీల్దారు కార్యాలయంలో పనిచేస్తుంటారు. వేతనం బాగానే ఉంటుంది. అది చాలదో ఏమో.. తన ఇంటి వద్ద లే అవుట్‌లో ప్రజల అవసరాలకు వదిలిన స్థలాన్ని ఆక్రమించాడు. ఇతరులకు అద్దెకు ఇచ్చి సొమ్ము చేసుకుంటున్నాడు. ఈ వ్యవహారం కొన్నేళ్లుగా సాగుతోంది. ఎవరూ పట్టించుకోవడం లేదు. అనంతపురం రూరల్ మండలంలో ఈ తతంగం సాగుతోంది. కురుగుంట గ్రామ పొలం సర్వే నంబర్లు 104-2బి, 105-2ఎ, 2బిలో 4.67 ఎకరాలు భూమి ఉంది. కొన్నేళ్ల కిందట ఆ భూమిలో ప్రస్తుతం అనంతపురం అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో పనిచేస్తున్న ఉద్యోయగి లే అవుట్ వేశారు. అప్పటికి ఆయనకు ఇంకా ఉద్యోగం రాలేదు. లే అవుట్‌లో రోడ్లు పోగా.. 67 ప్లాట్లు వేశారు. ప్రజా అవసరాల నిమిత్తం పంచాయతీకి 46.7 సెంట్లు ఓపెన్ సైట్ వదిలారు. ఆయన కూడా అదే లే అవుట్‌లోని ప్లాట్‌లో ఇల్లు నిర్మించుకున్నారు. అప్పటి నుంచి ఓపెన్ సైట్‌ను తన ఆధీనంలో ఉంచుకున్నారు. ఆ స్థలాన్ని ఇతరులకు బాడుగకు ఇచ్చారు. వారి నుంచి ప్రతి నెలా రూ.20 వేల వరకు ఆయన ఖాతాలో చేరుతోందని సమాచారం. ఇంత జరుగుతున్నా పంచాయతీ అధికారులు ఓపెన్ సైట్‌ను స్వాధీనం చేసుకోవడం లేదు. నిత్యం అదే దారిలో వెళ్లే పంచాయతీ అధికారులకు ఆక్రమణ గురించి తెలియదా..? అన్న చర్చ జరుగుతోంది. ప్లాన్‌లో ఓపెన్ సైట్ అని కనబరిచినా.. అధికారుల్లో చలనం లేకపోవడం విమర్శలకు తావిస్తోంది.


లేఅవుట్ ప్లాన్‌లో పంచాయతీకి వదిలిన స్థలం

ఇంజనీరింగ్ శాఖలకు ప్రమోట్ చేయండి

సచివాలయ ఇంజనీర్ల అసోసియేషన్ అధ్యక్షుడు మైలారప్ప, సెక్రటరీ రాఘవనాయుడు


హాజరైన ఇంజనీరింగ్ అసిస్టెంట్లు

అనంతపురం సిటి, జూలై 3: గ్రామ, వార్డు సచివాలయాల్లో పనిచేస్తున్న ఇంజనీరింగ్ అసిస్టెంట్లను ప్రభుత్వం తక్షణమే ప్రభుత్వ ఇంజనీరింగ్ శాఖలకు ప్రమోట్ చేయడంతో పాటు అర్హులకు పదోన్నతి కల్పించాలని సచివాలయ ఇంజనీర్ల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మైలారప్ప, సెక్రటరీ రాఘవ నాయుడు డిమాండ్ చేశారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో బుధవారం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అసోసియేషన్ అధ్యక్షుడిగా మైలారప్ప, సెక్రటరీగా రాఘవనాయుడు, ట్రెజరర్‌గా వీరేష్ ఎన్నికయ్యారు. అనంతరం వారు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో వివిధ శాఖలతో అనుసంధానమై పనిచేయడం జరిగిందన్నారు. టెక్నికల్, నాన్ టెక్నికల్ పనులు చేయించడంతో పని భారం ఎక్కువైందన్నారు. జాబ్‌చార్ట్ ప్రకారం ఇంజనీరింగ్ అసిస్టెంట్లను నాన్ టెక్నికల్ పనులకు కేటాయించరాదని డిమాండ్ చేశారు. ఇంజనీరింగ్ శాఖలైన హౌసింగ్, పంచాయతీరాజ్, ఇరిగేషన్, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖలకు ప్రమోట్ చేసి అర్హతను బట్టి పదోన్నతి కల్పించాలని కోరారు.

టెట్ గడువు పొడిగించాలి: డీవైఎఫ్ఐ

అనంతపురం విద్య, జూలై 3: రాష్ట్ర ప్రభుత్వం టెట్ గడువును పొడిగించాలని డిమాండ్ చేస్తూ డీవైఎఫ్ఐ నాయకులు ఏడీ కృష్ణయ్యను కోరారు. బుధవారం ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు బాలకృష్ణ తదితరులు డీఈఓను కలిసి విన్నవించేందుకు డీఈఓ కార్యాలయానికి వచ్చారు. ఆమె అందుబాటులో లేకపోవడంతో ఏడీని కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం టెట్ నోటిఫికేషన్ విడుదల చేయడం అభినందనీయమన్నారు. అయితే నోటిఫికేషన్ విడుదల చేసిన రోజు నుంచి టెట్ పరీక్షలకు చాలా తక్కువ సమయం ఉందన్నారు. కొత్తగా టెట్ రాయాలని అనుకున్న వారికి సిలబస్ పూర్తి చేయడానికి ఉన్న సమయం ఏమాత్రం సరిపోదన్నారు. టెట్‌కు కనీసం 100 రోజుల సమయం ఇవ్వాలని కోరారు. అభ్యర్థులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. ఈ మేరకు ఏడీకి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు నూరుల్లా, అభ్యర్థులు చెన్నయ్య, సూరి, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగులకు అండగా అమిలినేని: ఆర్డీవో

డీఎస్సీ ఉచిత కోచింగ్ సెంటర్ ప్రారంభం


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు, ఆర్డీవో రాణి సుష్మిత

కళ్యాణదుర్గం రూరల్, జూలై 3: నిరుద్యోగులకు శిక్షణ ఇచ్చేందుకు కోచింగ్ సెంటర్ ఏర్పాటు చేసి ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు అండగా నిలిచారని ఆర్డీవో రాణి సుష్మిత పేర్కొన్నారు. పట్టణంలోని మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన మెగా డీఎస్సీ ఉచిత కోచింగ్ సెంటర్‌ను బుధవారం ఆమె ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ డీఎస్సీ కోసం ప్రిపేర్ అవుతున్న నిరుద్యోగులకు ఉచితంగా రాష్ట్రస్థాయిలో నిష్ణాతులైన అధ్యాపకులచే శిక్షణ ఇప్పించేందుకు ఎమ్మెల్యే ముందుకు రావడం అభినందనీయమన్నారు. ఈ కోచింగ్ సెంటర్‌ను డీఎస్సీకి ప్రిపేర్ అవుతున్నవారు వినియోగించుకుని ఉపాధ్యాయ ఉద్యోగం సాధించాలని కోరారు. కరువు ప్రాంత నిరుద్యోగులు డిఎస్సీ కోచింగ్ కోసం సుదూర ప్రాంతాలైన అవనిగడ్డ, విజయవాడ, హైదరాబాద్ నగరాలకు వెళ్లకుండా కళ్యాణదుర్గంలోనే మంచి కోచింగ్ సెంటర్ ఏర్పాటు చేశారన్నారు. ఈ శిక్షణ కేంద్రంలో దాదాపు వెయ్యి మందికి పైగా శిక్షణ పొందనున్ననట్లు తెలిపారు. కార్యక్రమంలో అన్ని మండలాల విద్యాశాఖ అధికారులు ప్రజా ప్రతినిధులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

పెద్దాస్పత్రిలో అధునాతన సీటీ స్కాన్ సేవలు


యంత్రాన్ని ప్రారంభిస్తున్న సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావు

అనంతపురం టౌన్, జూలై 3: జిల్లా సర్వజన ఆస్పత్రిలో అధునాతన సీమెన్ సిటీ స్కాన్ యంత్రం సేవలను ప్రారంభించారు. గతంలో ఇక్కడ 16 స్లైట్స్ కెపాసిటీ యంత్రం ఉండగా ప్రస్తుతం 36 స్లైట్స్ కెపాసిటీ యంత్రాన్ని కొనుగోలు చేసారు. ఈ యంత్రాన్ని బుధవారం సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావు ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ అధునాతన సిటీస్కాన్ యంత్రం ద్వారా సూక్ష్మ లోపాలను కూడా గుర్తించవచ్చన్నారు. దీంతో రోగులకు అవసరమైన వైద్యచికిత్సలు అందించడానికి అవకాశం ఉంటుందన్నారు. ఇలాంటి యంత్రాలు సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రుల్లో ఉంటాయని అలాంటి యంత్రాన్ని ఆసుపత్రిలో ఏర్పాటు చేయడం ఆనందదాయకమన్నారు. వైద్యులు రోగులకు నాణ్యమైన వైద్యసేవలు అందేలా చూడాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఆర్‌ఎంఓ డాక్టర్ హేమలత, రేడియాలజీ విభాగం హెచ్ఓడీ డాక్టర్ సురేష్ పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

అనంతపురం విద్య, జూలై 3: జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు అర్హులైన టీచర్లు దరఖాస్తు చేసుకోవాలని డీఈఓ వరలక్ష్మి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలోని అన్ని యాజమాన్య పాఠశాలల్లో ప్రైమరీ, అప్పర్‌ప్రైమరీ, హైస్కూళ్లలో పనిచేసే టీచర్లు, ప్రధానోపాధ్యాయులు 2024 జాతీయ ఉత్తమ టీచర్ అవార్డులకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. టీచర్లు కనీసం 10 ఏళ్లు సర్వీసు పూర్తి చేసి ఉండాలన్నారు. దరఖాస్తులు http ://nationalawarstoteachers.education.gov.in వెబ్‌సైట్‌లో పొందాలన్నారు. పూర్తిచేసిన దరఖాస్తులను ఈనెల 15లోగా డీఈఓ ఆఫీస్‌లో అందజేయాలన్నారు.

జేఎన్‌టీయూ పరీక్షలు వాయిదా

అనంతపురం సెంట్రల్, జూలై 3: జేఎన్‌టీయూ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించాల్సిన వివిధ పరీక్షలను వాయిదా వేసినట్లు డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్ కేశవరెడ్డి బుధవారం ప్రకటనలో తెలిపారు. బంద్ కారణంగా వాయిదా వేయాల్సి వచ్చిందని తిరిగి వాటిని ఎప్పుడు నిర్వహించేది జేఎన్‌టీయూఏ వెబ్‌సైట్ ప్రదర్శిస్తామని పేర్కొన్నారు.

రేపటి నుంచి రాయచూరు ప్యాసింజరు ఆలస్యం

గుంతకల్లు, జూలై 3: గుంతకల్లు-రాయచూరు ప్యాసింజరు రైలు (నెం. 07799)ను ఈ నెల 5వ తేదీ నుంచి పావుగంట ఆలస్యంగా గమ్యాన్ని చేరేలా టైంటేబుల్‌ను నిర్ణయించినట్లు రైల్వే అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ రైలు గుంతకల్లులో బయలుదేరే సమయం మునుపటి మాదిరిగానే సాయంత్రం 6-50 గంటలుగా ఉంటుందని, గమ్యస్థానమైన రాయచూరుకు రాత్రి 9-35 గంటలకు బదులు 9-50 గంటలకు చేరుకుంటుందని తెలియజేశారు.

సాగు పద్ధతులు పాటిస్తే మంచి దిగుబడులు

వర్షాధారపంటల సాగుపై డాక్టర్ జాన్సన్


డాక్టర్ జాన్సన్

పుట్టపర్తి రూరల్, జూలై 3: వర్షాధార పంటల సాగులో రైతులు సరైన సాగు పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని జిల్లా ఏరువాక కోఆర్డినేటర్ డాక్టర్ జాన్సన్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక దీనజనోద్ధరణ సముదాయంలోని ఏరువాక కార్యాలయంలో వర్షాధార పంటలు సాగుచేసిన, సాగుచేసే రైతులకు ఆయన పలుసూచనలు చేశారు.

- వర్షాధారపంటలను సాగుచేసే రైతులు విత్తుకోవడానికి విత్తనాలను, పురుగుమందులను సేకరించుకోవాలి. విత్తనశుద్ధి చేసి నేలలో ఉన్న తేమను బట్టి వేరుశనగ, కంది, మొక్కజొన్న, సజ్జ, అముదం, పంటలను సాగుచేసుకోవాలి.

వేరుశనగ, విత్తనశుద్ధి

వేరుశనగ సాగుచేసే రైతులు బెట్టనుట్ట తట్టుకుని అధిక దిగుబడిని ఇచ్చే రకాలైన కదిరి-6, కదిరి-9, కదిరి హరితాంధ్ర, అనంత, గ్రీష్మ, నారాయణి, అభయ, ధరణి, కదిరి లేపాక్షి, టీసీజీయస్-1694 రకాలను ఎంచుకోవాలి. పంట ప్రారంభ దశలో రక్షణ కల్పించడానికి విధిగా విత్తనశుద్ధి చేసుకోవాలి. ఇమిడాక్లోప్రిడ్-600 ఎఫ్ఎస్ 2మి.లీలో 4 మి.లీ నీరు కలిపి కిలో విత్తనం శుద్ధి చేసుకోవాలి. అనంతరం టెబుకోనజోల్ 2శాతం డీఎస్ 1 గ్రాము లేదా మాంకోజెబ్ 3 గ్రాములు కిలో విత్తనం, ట్రైకోడెర్మా విరిడి 8 గ్రాములు కిలో విత్తనాన్ని శుద్ధి చేయడం ద్వారా నేల ద్వారా వచ్చే వ్యాధులను నియంత్రణ చేయవచ్చు.

- వేరుశనగ పొలంచుట్టూ రక్షక పంటగా సజ్జ, జొన్న, పంటలను 4, 5 వరసలు విత్తితే కాండం కుళ్లు వైరస్ తెగుళ్లను వ్యాప్తి చేసే రసంపీల్చే పురుగులైన తామరపురుగులు వ్యాప్తిని అరికట్టవచ్చు. వేరుశనగ పంటలో అంతరపంటగా సజ్జ, కంది పంటలను 7:1, 11:1, 15:1 నిష్పత్తిలో అంతరపంటగా విత్తుకోవాలి. జూన్ మొదటివారంలో విత్తిన వేరుశనగ పంట శాఖీయ దశలో ఉంది. రైతులు అంతర సేద్యం చేసుకోవాలి.
- వేరుశనగపంటకు సంబంధించి రసంపీల్చే పురుగులను నివారించడానికి జగటఅట్టలను ఎకరాకు 10, ఫెరోమాన్ ట్రాప్‌లను ఎకరాకు 4 అమర్చుకోవాలి.
- పొగాకు లద్దె పురుగు శనగ పచ్చ పురుగులు నివారించ డానికి ఎకరాకు 4 లింగాకర్షణ బుట్టలు పెట్టి మగరెక్కల పురుగులను నివారించాలి. ఎకరాకు 20 పక్షి స్థావరాలు ఏర్పాటుచేయాలి. 5 శాతం వేప గింజల కషాయం పిచికారి చేయాలి. క్వినాల్‌ఫాస్ 2 మిలీ వేపనూనె 5 మిలీ నీటికి కలిపి పిచికారి చేయాలి. ఎదిగిన లార్వాలకు ఏమామెక్టిన్ బెంజోయేట్0.4 లేదా క్లోరోఫైరిఫాస్ 2.5 మిలీ నీటికి కలిపి పిచికారి చేయాలి.

మొక్కజొన్న

- రైతులు మొక్క జొన్న విత్తనం జూలై 15లోపు విత్తుకోవాలి.
- కాప్టన్న లేదా మాన్కోజెబ్ 3గ్రాములు కిలో విత్తనానికి కలిపి విత్తనశుద్ధి చేసుకోవాలి. దీని వల్ల లేత దశలో మొక్కలను కీటకాలు, తెగుళ్లబారి నుంచి కాపాడవచ్చు.
- మొక్కజొన్నలో కలుపు నివారణకు విత్తనం విత్తిన రెండు మూడు రోజుల్లో ఆట్రజిన్ కలుపు మందును తేలిక నేలలో ఎకరానికి 800గ్రాముల బరువు నేలలో 1200 గ్రాములు 200 లీటర్ల నీటికి కలిపి పిచికారి చేయాలి.

పత్తి

- ప్రస్తుతం పత్తిపంట జిల్లాలో కొన్ని ప్రాంతాలలో మొలకదశ నుంచి పూతదశలో ఉంది. పత్తిని విత్తిన 20 నుంచి 30 రోజులలోపు గొర్రు గుంటకలతో అంతరకృషి ద్వారా కలుపు నివారణ చేయాలి.
- రసంపీల్చే పురుగులు ఆశించే అవకాశం ఉన్నందున నివారణకు వేపనూనె 5 మిలీ లేదా 5శాతం వేపగింజల కషాయం లీటర్ నీటికి కలిపి పిచికారి చేయాలి.
- తెల్లదోమను అదుపు చేయడానికి పసుపు రంగు జిగట అట్టలను ఎకరానికి 10 ఏర్పాటుచేయాలి. సంభవనీయతను పర్యవేక్షించడానికి ఎకరాకు 10ట్రిప్స్ , 10ట్లాస్టిక్ ట్రాప్‌లను ఏర్పాటుచేయాలి.
- ఇమిడాక్లోప్రిడ్ 0.4 మిలీ లేదా థయోమెథాక్సమ్ 25డబ్ల్యూ లేదా 0.2 అసిటామప్రిడ్ 0.2 గ్రా లీటర్ నీటికి కలిపి పిచికారి చేయాలి.

కంది

- కందిపంటను సాగుచేసే రైతులు పంటను బట్టి రకాలను ఎంచుకోవాలి.
- తేలికపాటి నేలల కోసం మధ్యస్థ కాలపరిమిత రకాలైన పీఆర్‌జీ -176, పీఆర్‌జీ-158, ఐసీపీఎల్84031 రకాలను ఎంచుకోవాలి.
- బరువునేలలకు మధ్యస్థ కాలపరిమితి రకాలైన ఎల్‌ఆర్‌జీ-41, ఎల్‌ఆర్‌జీ-52, ఎల్‌ఆర్‌జీ-105, టీఆర్‌జీ-59 వంటి రకాలను సాగుచేసుకోవచ్చు.
- కలుపు సమస్య ఎక్కువగా ఉంటే వెంటనే 24 గంటలలోపు ఎకరానికి 1.0-1.4 లీటర్ల పెండిమిథాలిన్ 200లీటర్లనీటికి కలిపి పిచికారి చేసుకోవాలి.

వరి

ప్రస్తుతం సాగుచేసేందుకు అనుకూల రకాలు సాంబమసూరి, నంద్యాలసన్నాలు, నెల్లూరుసోన, నెల్లూరు మసూరి, నంద్యాల సోన, యంటీయూ 1212, యంటీయూ1280, యంటీయూ 1281 రకాలు అనువైనవి.

- తెగుళ్లను నివారించడానికి నారుపోసేముందు తప్పనిసరిగా ఒకకిలో తడివిత్తనానికి 1.0గ్రాముల కార్బండైజిమ్, పొడివిత్తనానికి 3.0 గ్రాములు కలిపి విత్తనశుద్ధి చేసుకోవాలి.
- 5 సెంట్ల నారుమడికి 2కిలోల నత్రజని, (4.4 కిలోల యూరియా) కిలో భాస్వరం (6.25 కిలోల సింగల్ సూపర్ పాస్పేట్), కిలో పొటాష్ (1.6 కిలోల మ్యూరేట్ ఆఫ్‌పొటాష్) ఎరువులను వాడుకోవాలి.

ఇంటికి సౌర వెలుగులు


సోలార్ రూఫ్‌టాప్ ప్యానల్స్

> రూఫ్ టాప్ సోలార్ ప్లాంట్ ఏర్పాటుకు కేంద్రం సబ్సిడీ
> ఉత్పత్తి విద్యుత్ నుంచి మిగులు డిస్కంలకు విక్రయించే వీలు
> 1కేవీ నుంచి అనుమతులు

అనంతపురంరూరల్, జూలై 3: విద్యుత్ వినియోగదారులకు కేంద్ర ప్రభుత్వం తీపి కబురు అందించింది. విద్యుత్ బిల్లుల భారం తగ్గేలా పీఎం సూర్య ఘర్ ముఫ్త్ బిజ్లీ యోజనను ప్రకటించింది. ఇళ్లకు తగిన సోలార్ రూఫ్ టాప్ ప్లాంట్ అందుబాటులోకి తీసుకొచ్చింది. ఇంటి పైకప్పునకు వీటిని అమర్చి, దీని ద్వారా విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తారు. గృహ అవసరాలకు సరిపోగా మిగిలిన విద్యుత్‌ను డిస్కంలకు అమ్ముకునేలా వీలు కల్పించింది. ఈక్రమంలోనే ఆసక్తిగల వినియోగదారుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తోంది. ఏపీ ఎస్పీడీసీఎల్ సంస్థ సమన్వయంతో పలు సోలార్ కంపెనీలు వీటిని ఏర్పాటు చేస్తున్నాయి.

దరఖాస్తు ఇలా..

తొలుత వినియోగదారులు www/pmsuryaghar.gov.in. వెబ్‌సైట్ లో తమ పేర్లు నమోదు చేసుకోవాలి. ఆరు నెలలకు సంబంధించి విద్యుత్ బిల్లులను దరఖాస్తుకు జతచేయాలి. వ్యక్తిగత నివాసం నమూన, గృహ కామన్ సర్వీసుదారులకు ఈ పథకం వర్తిస్తుంది. 1 కే.వీ. సోలార్ రూఫ్ టాప్‌ను ఏర్పాటు చేయడానికి ఇంటి పైకప్పు మీద 10చ.మీ.స్థలం అవసరం ఉంటుంది. 1కేవీ కెపాసిటీ కోసం 3 నుంచి 4 సోలార్ ప్యానెళ్లను 1మీటర్ వెడల్పు, 1.6 మీటర్ల ఎత్తుతో అమర్చుతారు. 1కేవీ కెపాసిటీ సోలార్ ప్యానల్ ఏర్పాటుకు రూ.80వేలు అవుతుంది. ఇందులో వినియోగదారులకు రూ.30 వేల సబ్సిడీ వస్తుంది. 2కేవీ కెపాసిటీ ప్యానల్‌కు రూ.1.5లక్షలు కాగా..రూ.60వేలు సబ్సిడీ వస్తుంది. 3కేవీకిపైగా ఎంత కిలో వ్యాట్స్ తీసుకున్నా..రూ.78వేలు సబ్సిడీ అందుతుంది. దరఖాస్తు సమయంలోనే సోలార్ ఏర్పాటు కంపెనీలకు సంబంధించిన 13ఏజెన్సీల వివరాలు ఉంటాయి. దరఖాస్తుకు డిస్కమ్ క్లియరెన్స్ ఇచ్చిన తరువాత వినియోగదారులు నమోదు చేసుకున్న ఏజెన్సీ వారు రూఫ్‌టాప్‌ను ఇన్‌స్టాల్ చేస్తారు. తర్వాత వినియోగదారుడు నెట్ మీటర్ కోసం విద్యుత్ శాఖకు దరఖాస్తు చేసుకోవాలి. ఇంటి సర్వీసుకు నెట్ మీటర్ అమర్చిన తరువాత వినియోగదారుడు ఆ పోర్టల్‌లో తన బ్యాంకు ఖాతా వివరాలు అప్‌లోడ్ చేయాలి. ఆ తరువాత రాయితీ సొమ్ము 30 రోజుల్లో జమచేస్తారు.

ఉపయోగాలు ఇవి..


1కేవీ సోలార్ రూఫ్ టాప్ ప్యానెల్ నెలకు 125యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి చేస్తుంది. సామాన్య, మధ్యతరగతి కుటుంబాలు 150-200యూనిట్ల మధ్య వినియోగం ఉంటుంది. 1కేవీ సోలార్ ప్యానెల్ ఏర్పాటుతో కనీస విద్యుత్ బిల్లులను పొందేందుకు వీలుంటుంది. అంతేకాకుండా సోలార్ ప్యానళ్లు సూర్యుని వేడిని తీసుకోవడం ద్వారా ఇంటిలోపల చల్లగా ఉండేందుకు వీలుంటుంది. దీనికితోడు వినియోగదారుడు 5 నుంచి 6ఏళ్ల లోపు మూలధన వ్యయాన్ని తిరిగి పొందేందుకు అవకాశం ఉంటుంది.

విద్యుత్ బిల్లుల చెల్లింపుల్లో ఇబ్బందులు

అనంతపురం రూరల్, జూలై 3: విద్యుత్ బిల్లుల చెల్లింపులకు వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారు. గతంలో ఫోన్‌పే, గూగుల్‌పే, పేటీఎం యాప్‌ల ద్వారా బిల్లులు చెల్లించేవారు. విద్యుత్ పంపిణీ సంస్థలు డిస్కంలకు సంబంధించిన యాప్, వెబ్ సైట్ నుంచి బిల్లులు చెల్లించాలని ఉత్తర్వులు వెలువరించారు. అయితే ఏపీఎస్పీడీసీఎల్ యాప్ ద్వారా బిల్లులు చెల్లించేందుకు అవస్థలు పడుతున్నారు. అందులో ఫోన్ నెంబరు, ఈమెయిల్ ఐడి, పాస్‌వర్డ్ ఇతరత్ర నమోదు చేయాల్సి వస్తోంది. దీంతో సమస్యలు తలెత్తుతున్నాయి. ఒకవేళ అన్ని వివరాలు నమోదు చేసి బిల్లులు చెల్లిస్తే ఆ సర్వీసుకు పర్మనెంట్ మొబైల్ నెంబరు యాడ్ కానుంది. ఈ నేపథ్యంలో అద్దెకుంటున్నా వినియోగదారులకు భవిష్యత్తులో ఇబ్బందులు వచ్చే అవకాశం లేకపోలేదు. ఇంటి నిర్మాణం చేసుకున్న తరువాత కొత్త విద్యుత్ సర్వీసు తీసుకునే సమయంలో గతంలో సర్వీసు ఉన్నట్లు చూపే అవకాశం ఉంది. ఇల్లు మారిన పాత అద్దె ఇంటి వివరాలు చూపే అవకాశం ఉంది. ఈక్రమంలో మళ్లీ సదరు వ్యక్తులు విద్యుత్ ఈఆర్ఓ కార్యాలయానికి వెళ్లి అద్దెకుంటున్న సర్వీసు నెంబరుకు యాడ్ అయిన ఫోన్ నెంబరును తొలగించుకోవాల్సి వస్తుంది. ఇలా కాకుండా www.apspdcl.in. వెబ్ సైట్ ద్వారా బిల్లులు చెల్లించడం ద్వారా ఇలాంటి సమస్యలుండవని సంబంధిత అధికారులు వెల్లడిస్తున్నారు. వినియోగదారులు గూగుల్‌లోకి వెళ్లి వెబ్‌సైట్ ద్వారా బిల్లులు చెల్లించడం ఉత్తమం అంటున్నారు. వెబ్ సైట్‌లో బిల్ డెస్క్ మీద టచ్ చేస్తే విద్యుత్ సర్వీసు నెంబరు అడుగుతుంది. అందులో సర్వీసునెంబరు నమోదు చేసి తరువాత కింద ఉన్న మరో బాక్సులో క్యాప్‌చర్ నమోదు చేసి సబ్‌మిట్ కొడితే సర్వీసు నెంబరుకు సంబంధించిన వివరాలు వస్తాయి. తద్వారా అమౌంట్ చెల్లించవచ్చు. ఈవిధంగా చెల్లిస్తే భవిష్యత్తులో ఇబ్బందులు పడాల్సిన అవసరం ఉండదని అధికారులు అంటున్నారు.

మీ పిల్లలకైతే ఇలాగే వండిపెడతారా...?

కేజీబీవీ ఎస్ఓపై మంత్రి సవిత ఆగ్రహం.. సిబ్బందిపై చర్యలకు ఆదేశాలు



ఇన్‌చార్జ్ ఎస్ఓపై మండిపడుతున్న మంత్రి సవిత .. విద్యార్థుల నుంచి సమస్యలు అడిగి తెలుసుకుంటున్న మంత్రి

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

హిందూపురం(సోమందేపల్లి), జూలై 3: 'మీఇంట్లో పిల్లలకు ఇలాగే భోజనం వండిపెడతారా?' అంటూ స్థానిక కేజీబీవీ ఇన్‌చార్జ్ ఎస్ఓపై బీసీ సంక్షేమం, చేనేత, జౌళిశాఖ మంత్రి సవిత ఆగ్రహం వ్యక్తం చేశారు. మండల పరిధిలోని పాపిరెడ్డిపల్లి వద్ద ఉన్న కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాన్ని మంత్రి సవిత బుధవారం తనిఖీ చేశారు. ఆంధ్రజ్యోతిలో మంగళవారం ప్రచురితమైన 'ప్లీజ్ మా సమస్యలు పరిష్కరించండి' అనే కథనంపై ఆమె స్పందించారు. కేజీబీవీలోని సౌకర్యాలు, భోజనశాల, వంటగది, హాస్టల్, మరుగుదొడ్లను మంత్రి పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి వారి నుంచి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆరు నెలలుగా హిందీ ఉపాధ్యాయిని శాలినిదేవి ఇన్‌చార్జ్ ఎస్ఓగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఆమె ఆధ్వర్యంలో కేజీబీవీ నిర్వహణ అధ్వానంగా ఉందని మంత్రి అసహనం వ్యక్తం చేశారు. వంటగదిలో కుళ్లిన కూరగాయలు, అపరిశుభ్ర వాతావరణం, లోప భూయిష్ట రేషన్ నిర్వహణను గమనించి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తారా అని మండిపడ్డారు. వారం నుంచి కేజీబీవీలోని సమస్యలపై 60దాకా ఫిర్యాదులు అందాయని అన్నారు. అనంతరం ఎస్ఓ, హాస్టల్ వార్డెన్‌పై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని ఆ శాఖ ఉన్నతాధికారులకు ఆదేశాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డీవైఎస్ఓ రంగస్వామి, ఎంఈఓలు అంజినాయక్, ఆనంద్, టీడీపీ నాయకులు చంద్రశేఖర్, సిద్దలింగప్ప, వెంకటరమణ, హరిక్రిష్ణ, కిష్టప్ప తదితరులు పాల్గొన్నారు.

ముతవల్లుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా కేఎం షకీల్ షఫి


షకీల్ షఫికి శుభాకాంక్షలు తెలుపుతున్న ముస్లిం మైనార్టీ సంఘాల నాయకులు

అనంతపురం కల్చరల్, జూలై 3: రాష్ట్ర వక్ఫ్ బోర్డు అనుబంధ ముతవల్లుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా అనంతపురం నగరానికి చెందిన కేఎం షకీల్ షఫి నియమితులయ్యారు. వక్ఫ్‌బోర్డు చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ షాషావలి ఈ మేరకు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. అనంతపురం నగరానికి చెందిన పలువురు ముస్లిం మైనార్టీ సంఘాల నాయకులు షకీల్ షఫి నివాసానికి చేరుకుని పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. రానున్న రోజుల్లో మసీదుల అభివృద్ధికి, ముస్లిం మైనార్టీల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ సాలార్‌బాషా, ఐఎంఎం రాష్ట్ర అధ్యక్షుడు మహబూబ్‌బాషా, హెల్పింగ్ హ్యాండ్స్ అధ్యక్షుడు షబ్బీర్, నాసిర్ ఖాన్, కరీముల్లా, నూర్‌మహ్మద్, అక్రమ్, అల్లాబకాష్, జిలాన్, జాకీర్, సమీవుల్లా,

టమోటా కిలో రూ.34

అనంతపురం రూరల్, జూలై 3: కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా రూ.34 పలికాయి. బుధవారం 270 క్వింటాళ్ల టమోటా ఉత్పత్తులు మార్కెట్‌కు వచ్చాయి. కిలో గరిష్ఠంగా రూ.34తో అమ్ముడుపోయాయి. సరాసరి ధర రూ.30, కనిష్ఠ ధర రూ.26తో విక్రయాలు జరిగినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. కాగా టమోటా దిగుబడులు కాస్త పెరగడంతో బహిరంగ మార్కెట్‌లో రెండు మూడురోజులుగా టమోటా ధరలు కొంత తగ్గాయి.

చీనీ కాయలు టన్ను రూ.22వేలు

అనంతపురంరూరల్, జూలై 3: అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో బుధవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.22వేలు, కనిష్ఠంగా రూ.10వేలు, సరాసరి రూ.15వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి జయలక్ష్మి తెలిపారు. మార్కెట్ కు మొత్తంగా 525టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

బాధ్యతల స్వీకరణ

కొత్తచెరువు, జూలై 3: శ్రీసత్యసాయిజిల్లా శ్రీ శిశు సంక్షేమశాఖ(ఐసీడీఎస్) పీడీగా నాగమల్లేశ్వరి బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న కృష్ణకుమారి జూన్ 30న పదవీ విరమణ పొందారు. ఈ నేపథ్యంలో నాగమల్లేశ్వరి ఐసీడీఎస్‌పీడీగా బాధ్యతలు స్వీకరించారు. ఆమెకు సీడీపీఓలు, సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు శుభాకాంక్షలు తెలిపారు.

9న జడ్పీ సర్వసభ్య సమావేశం

అనంతపురం విద్య, జూలై 3: జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం ఈనెల 9న నిర్వహించనున్నారు. జడ్పీ సీఈఓ, ఇతర అధికారులు సర్వసభ్యసమావేశం నోట్‌ను మండలాలకు, ఎమ్మెల్యేలకు, జడ్పీటీసీలకు, ఇతర సభ్యులకు తెలియజేస్తున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత జరిగే తొలి సమావేశం ఇది. సభలో మెజార్టీ సభ్యులు వైసీపీ వారే ఉన్నారు. అయితే శాసనసభ్యులు, మంత్రులు కూటమి ప్రభుత్వం వారు ఉన్నారు. దీనికితోడు ఇప్పటికే పలువురు జడ్పీటీసీలు టీడీపీకిలో చేరారు. ఈ క్రమంలో 9న జరిగే సమావేశంలో చర్చలు, వాదోపవాదాలు రసవత్తరంగా ఉంటాయని జడ్పీ వర్గాల్లో చర్చనడుస్తోంది.

హత్య కేసులో నిందితుల అరెస్ట్

గుంతకల్లు టౌన్, జూలై 3: భర్తను హత్య చేసిన కేసులో భార్య, ఆమె ప్రియుడిని వన్‌టౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. బుధవారం వన్‌టౌన్ సీఐ రామసుబ్బయ్య అరెస్ట్ వివరాలను వెల్లడించారు. విద్యుత్‌శాఖలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న దాసరి ఆంజనేయులు రామిరెడ్డి కాలనీలో నివాసముంటున్నాడు. ఆయనకు దాసరి కావేరితో ఆరు సంవత్సరాల క్రితం వివాహమైంది. వీరికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. అయితే కావేరికి ఆదోని పట్టణానికి చెందిన పింజరి పీరాన్‌బాషాతో కొంత కాలం క్రితం పరిచయం ఏర్పడి అదికాస్త వివాహేతర సంబంధానికి దారితీసింది. ఈ నేపథ్యంలో అంజనేయులును అడ్డుతొలగించుకోవాలని కావేరి భావించింది. జూన్ 29న ఆంజనేయులు మద్యం సేవించి ఇంటికి వచ్చాడు. ఇదే అదునుగా భావించిన కావేరి పీరాన్‌బాషాను ఇంటికి పిలిపించుకుని ఆంజనేయులును హతమార్చింది. పీరాన్‌బాషా ఆదోనికి వెళ్లిపోయాడు. తన భర్త గుండెపోటుతో మృతి చెందాడని అందరినీ కావేరి నమ్మించే ప్రయత్నం చేసింది. అయితే ఆంజనేయులు అన్నదమ్ములకు అనుమానం రావడంతో వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కావేరి, పిరాన్‌బాషాలను అదుపులోకి తీసుకుని విచారించడంతో వారు నేరం చేసినట్లు ఒప్పుకున్నారు. ఇద్దరిని అరెస్టు చేసి పెనుకొండ న్యాయాధికారి ఎదుటహాజరుపరచడం జరిగిందని సీఐ తెలిపారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి


చంద్రయ్య (ఫైల్)

తాడిమర్రి, జూలై 3: మండలంలోని ఏకపాదంపల్లి గ్రామానికి చెందిన రైతు గంధ్రగొడ్డలి చంద్రయ్య (47) విద్యుదాఘాతంతో మృతిచెందినట్లు ఏఎస్ఐ వన్నప్ప తెలిపారు. బుధవారం తెల్లవారుజామున 3 గంటల సమయంలో నీటిని పట్టేందుకు చంద్రయ్య ఇంటి వద్ద మోటారును ఆన్‌చేశాడు. చంద్రయ్య మోటారును తాకడంతో ఒక్కసారిగా విద్యుదాఘాతానికి గురై కిందకు పడ్డాడు. తల వెనుకరాయి కొట్టుకుని బలమైన గాయమైంది. గమనించిన కుటుంబసభ్యులు చంద్రయ్యను బత్తలపల్లి ఆర్డీటీ వైద్యశాలకు తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

కోర్టు కేసులపై ప్రత్యేక దృష్టి పెట్టండి

● అధికారులకు కలెక్టర్ ఆదేశం



మాట్లాడుతున్న కలెక్టరు వినోద్ కుమార్

అనంతపురం టౌన్, జూలై 3: కోర్టు కేసులను సకాలంలో పరిష్కరించేందుకు ఆయాశాఖల అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని కలెక్టర్ వినోద్ కుమార్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని రెవెన్యూభవన్‌లో జిల్లా శాఖల ఉన్నతాధికారులతో కోర్టు కేసులు, వాటి పరిస్థితులపై కలెక్టర్ ఆరా తీశారు. ఆయన మాట్లాడుతూ కంటెంప్ట్ కేసులు కోర్టులో నమోదైన వెంటనే చొరవ తీసుకొని వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టాలన్నారు. ఆయాశాఖల పరిధిలో కేసులు పెండింగ్ లేకుండా చూసుకోవాలని సూచించారు. జేసీ కేతన్‌గార్గ్, డీఆర్‌ఓ రామక్రిష్ణారెడ్డి, సీపీఓ అశోక్ కుమార్‌రెడ్డి, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను వినియోగించుకోవాలి

ప్రభుత్వ అందించే సాయాన్ని ప్రతి లబ్ధిదారుడు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ వినోద్ కుమార్ సూచించారు. స్టాండప్ ఇండియా పథకం కింద రాజమ్మ అనే మహిళకు సెల్ఫ్ లోడింగ్ కాంక్రీట్ మిక్సర్ యంత్రం మంజూరైంది. ఆ యంత్రాన్ని కలెక్టర్ ఆమెకు అందజేశారు. కలెక్టర్ మాట్లాడుతూ యంత్రం విలువ రూ.48లక్షలు అని, కెనరాబ్యాంకుద్వారా రూ.36లక్షలు రుణం అందించినట్లు తెలిపారు.

బాధితులకు పరిటాల శ్రీరామ్ పరామర్శ


కొత్తగేరిలో బాధిత కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న పరిటాలశ్రీరామ్

రామగిరి, జూలై 3: మండలంలోని కొత్తగేరి గ్రామంలో ధర్మవరం టీడీపీ ఇన్‌చార్జి పరిటాలశ్రీరామ్ బుధవారం పర్యటించారు. ఓ ప్రైవేటు కార్యక్రమానికి వెళ్లిన ఆయన కొత్తగేరి గ్రామంలో టీడీపీ నాయకులతో కలిసి గ్రామ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం నాయకులు లింగా శివ కుమారుడు అనారోగ్యంతో బాధపడుతూ కోలుకుంటుండటంతో అతని ఇంటి వద్దకు వెళ్లి పరామర్శించారు. అలాగే శ్రీధర్‌నాయుడు తల్లి సుబ్బమ్మ అనారోగ్యంతో బాధపడుతుండగా వారింటికి వెళ్లి ఆమెను కుటుంబసభ్యులను పరామర్శించారు. ఈయన వెంట రామ్మూర్తినాయుడు, పరంధామయాదవ్, పోతన్న, ఎంపీటీసీ శ్రీనివాసులు, రవి, చంద్రశేఖర్, వెంకటరాముడు ఉన్నారు.

బడ్జెట్ స్కూళ్ల సమస్యలు పరిష్కరించండి


మంత్రి లోకేశ్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

అనంతపురం విద్య, జూలై 3: బడ్జెట్ స్కూళ్ల సమస్యలను పరిష్కరించాలని అనంతపురం జిల్లా ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ (ఏడీపీఎస్‌ఏ) నాయకులు మంత్రి నారా లోకేశ్‌ను కోరారు. బుధవారం విజయవాడలో ఆ సంఘం నాయకులు మంత్రిని కలిశారు. వారు మాట్లాడుతూ యువగళం పాదయాత్రలో బడ్జెట్ స్కూళ్ల సమస్యలను మీ దృష్టికి తీసుకొచ్చామని గుర్తు చేశారు. రాష్ట్రంలో బడ్జెట్ ప్రైవేట్ స్కూళ్ల యాజమాన్యాలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ మేరకు మంత్రికి వినతిపత్రం అందించారు. ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు గోపాల్, సీఆర్వో రవిచంద్రారెడ్డి, నగర అధ్యక్షులు చంద్రశేఖర్‌రెడ్డి, గౌరవ సలహాదారులు రామాంజనేయులు, ఇతర నేతలు పీవీఎస్ నాయుడు, లక్ష్మీనారాయణ, చిత్తయ్య పాల్గొన్నారు.

ఉద్యోగులను హీనంగా చూసిన వైసీపీ ప్రభుత్వం

● మంత్రి లోకేశ్ వద్ద ఆర్‌ఈఎఫ్ నాయకులు


మంత్రి లోకేశ్‌తో ఆర్‌ఈఎఫ్ నాయకులు

అనంతపురం సెంట్రల్, జూలై 3: రాజ్యాంగబద్ధంగా ఉద్యోగులకు కల్పించాల్సిన హక్కులను విస్మరించడమే కాకుండా హీనాతిహీనంగా చూశారని వైసీపీ ప్రభుత్వ తీరుపై ఆర్‌ఈఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రామచంద్ర వాపోయారు. ఈ మేరకు విద్యాశాఖ మంత్రి నారాలోకేశ్‌ను విజయవాడలో కలిసి ఉద్యోగుల సమస్యలను వివరించామన్నారు. వైసీపీ ప్రభుత్వంలో రిజర్వేషన్ ఉద్యోగులపై జరిగిన దాడులు, అన్యాయాలు, అక్రమాలపై మంత్రి దృష్టి తెచ్చినట్లు తెలిపారు. ప్రతి ఉద్యోగి ఎదుర్కొన్న సమస్యలను సత్వరమే పరిష్కరించి వారి హక్కులను కాపాడుతామని మంత్రి లోకేశ్ భరోసానిచ్చారని పేర్కొన్నారు. రామచంద్ర వెంట వర్సిటీ అధ్యక్షుడు ఎండీ నాగభూషణంతోపాటు ఇతర ఉద్యోగులు పాల్గొన్నారు.

ట్యాంకర్ ద్వారా వరిపైరుకు నీరు


ట్యాంకర్ ద్వారా వరి పైరుకు నీరు పెడుతున్న దృశ్యం

రాప్తాడు, జూలై 3: నియోజకవర్గ కేంద్రానికి చెందిన రైతు గంజి భూషణ రెండు రోజుల క్రితం వరి పైరు కోసం మొలకెత్తిన విత్తనాలను చల్లాడు. అప్పటి నుంచి వ్యవసాయానికి విద్యుత్ సరఫరా కాకపోవడంతో బుధవారం సాయంత్రం ట్యాంకర్ నీటిని రూ.1000కి కొనుగోలు చేసి వరిపైరుకు సరఫరా చేశాడు. నీరు లేకపోతే పైరు ఎండిపోతుందని, తప్పని పరిస్థితుల్లో ట్యాంకర్ ద్వారా నీరు అందించినట్లు తెలిపాడు. దీనిపై విద్యుత్ శాఖ ఏఈ రమాదేవిని వివరణ కోరగా ధర్మవరం నుంచి వచ్చే మెయిన్ సప్లైలో అంతరాయం ఏర్పడుతోందన్నారు. సిబ్బంది రెండు రోజుల నుంచి సమస్య పరిష్కరించేందుకు పని చేస్తున్నామన్నారు.

భారం.. హిందూపురం ప్రయాణం..!

● సర్వీసుల ఆలస్యంపై ప్రయాణికుల మండిపాటు

అనంతపురం కల్చరల్, జూలై 3: హిందూపురం రూట్‌లో ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం ప్రయాణికుల పాలిట భారంగా మారింది. సకాలంలో సర్వీసులు అందుబాటులో లేకపోవడంతో ప్రయాణికులు మండిపడుతున్నారు. అనంతపురం నుంచి హిందూపురం వెళ్లేందుకు బుధవారం ఉదయం 8 నుంచి 9.30 గంటల వరకు దాదాపు 150 మందికి పైగా ప్రయాణికులు అనంతపురం బస్టాండులో వేచిచూడడం కనిపించింది. హిందూపురంతోపాటు అదే రూట్‌లో పెనుకొండ, ఎస్ఎస్ గేట్, సీకే పల్లి తదితర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు దాదాపు గంటన్నరకు పైగా బస్సుల కోసం వేచి ఉండాల్సిన దుస్థితి నెలకొంది. చంటిపిల్లలతో ఉన్న తల్లులు మొదలుకొని వృద్ధులు బస్సులకోసం పడిగాపులు కాయాల్సి రావడంతో ఆర్టీసీ అధికారుల అలసత్వంపై ప్రయాణికులు అసహనానికి గురయ్యారు. ఇప్పటికైనా బస్సు సర్వీసులను పెంచాలని ప్రయాణికులు కోరుతున్నారు.


హిందూపురం రూట్ బస్సులకోసం వేచిచూస్తున్న ప్రయాణికులు

అంబేడ్కర్ ఆశయ సాధనే సీఎం ధ్యేయం

● ఎమ్మెల్యే పరిటాల సునీత


అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే, నాయకులు

చెన్నేకొత్తపల్లి, జూలై 3: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయ సాధనే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ధ్యేయమని ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. అందరి వాడు ఉత్సవ సొసైటీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో బుధవారం నిర్వహించిన అంబేడ్కర్ 133వ జయంత్యుత్సవాలకు పరిటాలసునీత ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ముందుగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సీవీ ప్రసాద్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వంలోనే దళితులకు సముచిత న్యాయం జరుగుతుందన్నారు. దళితులకు రాజకీయంగా తగిన ప్రాధాన్యం కల్పించిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందన్నారు. అందరివాడు ఉత్సవ సొసైటీ ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటుచేయడం అభినందనీయమన్నారు. ఈ ప్రాంతంలో పలు అభివృద్ధి పనుల మంజూరుకు కృషిచేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం 10వ తరగతిలో 500కుపైగా మార్కులు సాధించిన 35 మంది విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందజేశారు. చిన్న ఆంజనేయులు, వేణుగోపాల్, ముత్యాలప్ప నాగరాజు, శ్రీనివాసుల సహాయ సహకారాలతో ఉత్సవాలను నిర్వహించినట్లు సొసైటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో బీసీసెల్ జిల్లా అధ్యక్షుడు కుంటిమద్ది రంగయ్య, కన్వీనర్ ముత్యాల్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు దండు ఓబుళేశు, మాజీ ఎంపీపీ అంకే అమరేంద్ర, జనసేన కన్వీనర్ క్రాంతికుమార్, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు జిలకర ఆంజనేయులు, ఏపీ శ్రీనివాసులు, సావిత్రి పాల్గొన్నారు.

రాజధాని నిర్మాణానికి పింఛన్ అందజేత

మండల కేంద్రానికి చెందిన టీడీపీ పంచాయతీ అధ్యక్షుడు ఈడిగ చెన్నకేశవుల గౌడ్ రాజధాని అమరావతి నిర్మాణానికి తనవంతుగా పింఛన్ సొమ్మును విరాళంగా అందజేశాడు. బుధవారం ఎమ్మెల్యే పరిటాలసునీతను కలిసి జూలైనెలకు సంబంధించిన దివ్యాంగ పింఛన్ రూ.6వేల నగదును అందజేశాడు.


ఎమ్మెల్యే పరిటాల సునీతకు పింఛన్ నగదును అందజేస్తున్న దృశ్యం

ప్రతిరోజు చెత్త ఎత్తాల్సిందే..!

● డ్రైనేజీలు శుభ్రం చేయాల్సిందే

● నగరపాలిక అధికారులకు ఎమ్మెల్యే దగ్గుపాటి హెచ్చరిక


రాంనగర్ పార్కు వద్ద చెత్తను దగ్గరుండి తీయిస్తున్న ఎమ్మెల్యే

అనంతపురం అర్బన్, జూలై 3: కనీసం డ్రైనేజీలను శుభ్రం చేయించలేని చెత్త ప్రభుత్వం పాలన ఇప్పటి వరకు సాగింది. ఈ ప్రభుత్వంలో నిర్లక్ష్యం వహించేందుకు వీల్లేదని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ హెచ్చరించారు. బుధవారం ఉదయం 36, 37, 38వ డివిజన్ల పరిధిలోని వీధుల్లో ఎమ్మెల్యే కలియతిరిగారు. నగరపాలక సంస్థ అధికారులతో కలిసి ఆయా ప్రాంతాల్లో పారిశుధ్య పనులను పరిశీలించారు. పలు కూడళ్లల్లో చెత్త పేరుకుపోవడంపై ఎమ్మెల్యే తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఎప్పటికప్పుడు చెత్తను తరలించేలా ఎందుకు చర్యలు తీసుకోలేదని అధికారులను ప్రశ్నించారు. రాంనగర్ పార్కు వద్ద ఎమ్మెల్యే దగ్గరుండి చెత్తను తీయించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, శానిటరీ సెక్రటరీలు, మేస్త్రీలు పర్యవేక్షిస్తున్నా కార్మికులతో సక్రమంగా పనిచేయించపోవడం ఏమిటని నిలదీశారు. నగర ప్రజలు ప న్నులు చెల్లిస్తున్నారని, వారికి కనీసం ఆరోగ్యకరమైన వాతావరణాన్ని ఇవ్వకపోతేఎలా అంటూ మండిపడ్డారు. నగరంలో ప్రతి రోజు చెత్త ఎత్తివేయాల్సిందేనని, డ్రైనేజీలు శుభ్రం చేయాల్సిందేనని ఆదేశించారు. పా ర్కుల్లో అన్ని సౌకర్యాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. మరువ వంక, నడిమి వంక కాలువల్లో పూడిక తీత పనులు చేపట్టాలని ఆదేశించారు. సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లి అండర్ డ్రైనేజీ వ్యవస్థను తీసుకొస్తామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. టీడీపీ నాయకులు గంగారామ్, కూచి హరి, రాయల్ మురళీ, రాజీవ్‌రెడ్డి, పోతుల లక్ష్మీనరసింహులు, ఫిరోజ్, రాయల్ మధు, బాలప్ప, ఆదినారాయణ, అధికారులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరించండి: తమ కాలనీల్లో నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించాలని ఎమ్మెల్యే దగ్గుపాటిని అనంత సాగర్, విజయనగర కాలనీ వాసులు కోరారు. స్థానిక శ్రీనగర్ కాలనీలోని టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యేను ఆయా కాలనీ వాసులు కలిసి వినతి పత్రం అందజేశారు. ఎమ్మెల్యే స్పందిస్తూ సంబంధిత అధికారులతో మాట్లాడి తాగునీటి సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రామలింగారెడ్డి, బీకేఎస్ మండల కన్వీనర్ అశోక్, మాజీ సర్పంచ్ లక్ష్మీనారాయణ, ఈశ్వర్, సుబ్బరాయుడు పాల్గొన్నారు.

దివ్యాంగులకు టీడీపీ అండ: దివ్యాంగులకు టీడీపీ ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ అన్నారు. దివ్యాంగుల పింఛన్లను పెంచిన నేపథ్యంలో బుధవారం స్థానిక అనంతపురం అర్బన్ టీడీపీ కార్యాలయం వద్ద చెవిటి, మూగ అసోసియేషన్ ఆధ్వర్యంలో సంబరాలు చేసుకున్నారు. అసోసియేషన్ సభ్యులతో కలిసి చంద్రబాబు, పవన్ కళ్యాణ్ చిత్రపటాలకు ఎమ్మెల్యే క్షీరాభిషేకం చేశారు.


చంద్రబాబు చిత్రాపటానికి క్షీరాభిషేకం చేస్తున్న దివ్యాంగులు

పింఛన్లపై కేంద్ర బృందం పరిశీలన


మరూరులో సచివాలయ సిబ్బందితో ఆరా తీస్తున్న బృందం సభ్యులు

రాప్తాడు, జూన్ 3: వృద్ధాప్య, వితంతు, దివ్యాంగ పింఛన్లపై కేంద్ర పరిశీలన బృందం బుధవారం మండలంలోని మరూరు, బండమీదపల్లి గ్రామాల్లో పరిశీలించారు. ఆయా గ్రామాల్లో ఎన్ని పింఛన్లు వస్తున్నాయి, 90 ఏళ్ల పైబడిన వృద్ధులు ఎంత మంది ఉన్నారు? పింఛన్లకు అర్హులేనా? అని గ్రామ సచివాలయాలతో పాటూ పింఛన్‌దారుల వద్దకు వెళ్లి ఆరా తీశారు. 2020-21, 2021-22, 2022-23 సంవత్సరాల్లో ఎవరెవరు పింఛన్లకు దరఖాస్తు చేసుకున్నారు? వారందరూ పింఛన్లకు అర్హులేనా అని పరిశీలించారు. పింఛన్లపై గ్రామ సచివాలయాల్లో రికార్డులు సక్రమంగా నమోదు చేస్తున్నారా లేదా అని రికార్డులు పరిశీలించారు. కేంద్ర బృందం ఎంఓఆర్‌డీ మామ్‌చాంద్, ఎంపీడీఓ గీతావాణి, గ్రామ సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

అంధులకు అండగా అమ్మ సంస్థ


అంధులకు ఆర్థికసాయం అందజేస్తున్న తరిమెల రమణారెడ్డి

అనంతపురం కల్చరల్, జూలై 3: ఐదుగురు అనాథ అంధులకు ఉపాధి నిమిత్తం ఆర్థిక సాయం అందజేసి అమ్మ సంస్థ అండగా నిలిచింది. శెట్టూరు మండలానికి చెందిన అంజినప్ప, ఆంథోనప్ప, జానకి, అనంతపురం నగరానికి చెందిన ప్రకాష్, రంగయ్యశెట్టి అంధులు. ఈ ఐదుగురిలో నలుగురు దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతుండడంతో వారికి నెలకు రూ.4వేలు చొప్పున మందుల అవసరం ఉంది. వారికి వచ్చే పింఛన్ మందులకే సరిపోకపోవడంతో తినడానికి తిండి, ఉండడానికి సొంతిల్లు లేక అనేక కష్టాలెదుర్కొంటున్నారు. దీంతో వారు అమ్మ సంస్థను ఆశ్రయించారు. బుధవారం సంస్థ కార్యాలయంలో ఐదుగురికి ఒకొకరికి రూ.20వేలు చొప్పున రూ.లక్ష వారి జీవనోపాధికోసం సంస్థ అధ్యక్షుడు తరిమెల రమణారెడ్డి అందజేశారు.

నకిలీ సిగరెట్ల పట్టివేత

అనంతపురం క్రైం, జూలై 3: అనంతపురం వన్‌టౌన్ పోలీసులు నకిలీ సిగరెట్లను పెద్ద మొత్తంలో పట్టుకున్నారు. బుధవారం వన్‌టౌన్ సీఐ రెడ్డప్ప, సెబ్ సీఐ యల్లయ్య, కృష్ణ, ఎస్ఐ సరస్వతి సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. కన్యకా పరమేశ్వర్ జనరల్ స్టోర్‌లో విక్రయించేందుకు సిద్ధంగా ఉన్న ఫేక్ సిగరెట్లను స్వాధీనం చేసుకున్నారు. వాటి విలువ రూ.10లక్షలు ఉంటుందని అంచనా వేశారు. యజమాని సుధాకర్‌పై కాపీ రైట్ యాక్ట్ కేసు నమోదు చేశారు.

పోలీస్ మినిస్టీరియల్ స్టాఫ్ అసోసియేషన్ అధ్యక్షుడిగా గోపీకృష్ణ

అనంతపురం క్రైం, జూలై 3: ఆంధ్రప్రదేశ్ పోలీస్ మినిస్టీరియల్ స్టాఫ్ అసోసియేషన్ జిల్లా కార్యవర్గం ఎన్నిక బుధవారం స్థానిక డీపీఓలో జరిగింది. జిల్లా అధ్యక్షుడిగా బి.గోపీకృష్ణ, ఉపాధ్యక్షులుగా వైవీ రమణ, జంషీదాబాను, ముఖ్య కార్యదర్శిగా శివకుమార్, జాయింట్ సెక్రటరీగా సుధారాణి, ఆర్గనైజింగ్ సెక్రటరీగా వాణి, కోశాధికారిగా సతీష్‌కుమార్, ఈసీ మెంబర్లుగా సత్యవతి, స్రవంతిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

పాఠశాలను తనిఖీ చేసిన డీఈఓ


రికార్డులు పరిశీలిస్తున్న డీఈఓ వరలక్ష్మి

ఆత్మకూరు, జూలై 3: మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలను బుధవారం జిల్లా విద్యాశాఖ అధికారి వరలక్ష్మి ఆకస్మిక తనిఖీ చేశారు. పాఠశాలలో ఉపాధ్యాయుల పనితీరుపై మండల అధికారులతో సమీక్షించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థుల సమస్యలు, పాఠ్యపుస్తకాల పంపిణీ తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారులు నరసింహారెడ్డి, రామాంజనేయులు పాల్గొన్నారు.

వసతి గృహాన్ని పరిశీలించిన కలెక్టర్

రాప్తాడు, జూలై 3: ప్రభుత్వ బాలుర వసతి గృహంలో మౌలిక సదుపాయాలు కల్పించాలని జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్ తెలిపారు. మండలంలోని హంపాపురం బాలుర వసతి గృహాన్ని కలెక్టర్ బుధవారం పరిశీలించారు. వసతి గృహంలో నిత్యావసర వస్తువులు, మెనూ పట్టిక, మరుగుదొడ్లు, గదులను పరిశీలించారు. వసతి గృహంలో గార్డెన్ అభివృద్ధి చేయాలని, మొక్కలు నాటి సంరక్షించాలన్నారు. వార్డెన్ మారుతి చేత మొక్కలు నాటించి వాటిని సంరక్షించాలని విద్యార్థుల చేత ప్రతిజ్ఞ చేయించారు. బీసీ వెల్ఫేర్ డీడీ కుష్బూ కొఠారి, హాస్టల్ అధికారులు పాల్గొన్నారు.

జన్యు లోపాలున్న పిల్లలకు సత్వరం చికిత్స అందించాలి

● డీఎంహెచ్ఓ ఈబీ దేవి

అనంతపురం టౌన్, జూలై 3: పుట్టకతోనే లోపాలతో జన్మించిన పిల్లలకు సత్వరం వైద్యసేవలు అందించాలని డాక్టర్లకు డీఎంహెచ్ఓ డాక్టర్ ఈబీ దేవి ఆదేశించారు. బుధవారం డీఈఐసీ ఆధ్వర్యంలో డాక్టర్లకు జిల్లా వైద్యశాఖ కార్యాలయంలో శిక్షణ ఏర్పాటు చేశారు. డీఎంహెచ్ఓ మాట్లాడుతూ పౌష్టికాహార లోపం, జన్యుపరమైనలోపాలు, నెలలు నిండకనే ప్రసవాలు తదితరకారణాల వల్ల పుట్టకతోనే అనేక లోపాలతో పిల్లలు జన్మిస్తున్నారు. అలాంటి పిల్లల లోపాలను త్వరగా గుర్తించి వెంటనే వైద్యచికిత్సలు అందేలా డాక్టర్లు బాధ్యత తీసుకోవాలన్నారు. జిల్లా ఆస్పత్రి ఆవరణలో ఉన్న సత్వర చికిత్సా కేంద్రానికి సమాచారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ నారాయణస్వామి, మేనేజర్ రజిత పాల్గొన్నారు.

జ్వర బాధితులకు రక్త పరీక్షలు చేయాలి

జ్వరంతో బాధపడుతున్న వారందరికి రక్తనమూనాలు తీసి పరీక్షలు చేయించాలని జిల్లా మలేరియా అధికారి (డీఎంఓ) డాక్టర్ ఓబులు ఆదేశించారు. బుధవారం జిల్లా కార్యాలయంలో ల్యాబ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. డీఎంఓ మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న నేపథ్యంతో జ్వరాలతో బాధపడుతున్న వారికి తప్పనిసరిగా రక్త పరీక్షలు చేయించి వ్యాధి నిర్ధారణ చేస్తే అక్కడ నివారణ చర్యలు తీసుకోవడానికి అవకాశం ఉంటుందన్నారు. జ్వర బాధితుల కేసులను అలాగే వదిలేస్తే వ్యాధులు మరింత పెరిగే అవకాశం ఉంటుందన్నారు. రక్త పరీక్షల వివరాలను ప్రతిరోజు జిల్లా కార్యాలయానికి పంపించాలని, ఈవిషయంలో ఎవరు నిర్లక్ష్యం చేసినా చర్యలు తప్పవని డీఎంఓ హెచ్చరించారు.

నూనె గింజలపై రైతులకు అవగాహన

నార్పల, జూలై 3: మండలంలోని నడిమిదొడ్డి గ్రామంలో రెడ్డిపల్లి కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో బుధవారం నూనె గింజల పథకంపై రైతులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. శాస్త్రవేత్త డాక్టర్ శశికళ మాట్లాడుతూ టీసీజీఎస్ 1964 వేరుశనగ రకంపై, వాటి సాగు విధానాన్ని వివరించారు. వ్యవసాయ అధికారి చిన్నవీరస్వామి, వ్యవసాయ విస్తరణ అధికారి రాము, నడిమిదొడ్డి గ్రామ సర్పంచు నాగలక్ష్మి, రైతులు పాల్గొన్నారు.

పకడ్బందీగా గూగూడు బ్రహ్మోత్సవాలు

● రివ్యూ మీటింగ్‌లో ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ సూచన


స్నానాల బావిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

నార్పల, జూలై 3: గూగూడు కుళ్లాయిస్వామి బ్రహ్మోత్సవాలు 7వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయని, ఉత్సవాలను పకడ్బందీగా నిర్వహించడంతో పాటు అన్ని శాఖల అధికారులు బాధ్యతగా పనిచేయాలని శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ అన్నారు. బుధవారం మండలంలోని గూగూడు గ్రామంలో ఎమ్మెల్యే అధికారులతో రివ్యూ మీటింగ్ నిర్వహించారు. మొదట గ్రామంలోని బస్టాండ్‌లో స్నానాలు చేసే బావి, వసతి స్థలాలను, క్యూలైన్ స్థలాలను ఎమ్మెల్యేతో పాటు టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆలం నరసానాయుడు పరిశీలించారు. అనంతరం అధికారులతో ఎమ్మెల్యే మాట్లాడుతూ భక్తులకు బస్సులు ఏర్పాటు చేయాలని, మహిళలకు స్నానాల గదులు ప్రత్యేకంగా ఏర్పాటు చేయాలన్నారు. అధికారులందరూ గత అనుభావలను దృష్టిలో ఉంచుకుని భక్తులకు ఎటువంటి లోటుపాట్లు లేకుండా చూడాలన్నారు. తాగునీరు, వైద్య సదుపాయాలు, అగ్నిగుండం వద్ద క్యూలైన్లు పోలీస్ శాఖ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఉత్సవాలలో ఏ చిన్న సమస్య తలెత్తినా అధికారులే బాధ్యత వహించాలన్నారు. ఆర్డీఓ వెంకటేష్, డీపీఓ ప్రభాకర్, తహసీల్దారు లక్ష్మీనారాయణ, ఎంపీడీఓ రాముడు, ఎస్ఐ రాజశేఖర్‌రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రవీంద్రనాథ్, టీడీపీ నాయకులు ఆకుల ఆంజనేయులు, పిట్టురంగారెడ్డి, ఆకుల విజయ్, ప్రతాప్‌చౌదరి, రాజన్న, జాఫర్‌వలి, చంద్రబాబు, ఆకులతేజ, ఎర్రినాగప్ప పాల్గొన్నారు.

పుట్టపర్తి అభివృద్ధికి సహకరించండి

● విశాల ఫెర్రర్‌ను కోరిన ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి


విశాల ఫెర్రర్‌కు మొక్కను అందజేస్తున్న ఎమ్మెల్యే సింధూరరెడ్డి, పల్లె కిశోర్‌రెడ్డి

అనంతపురంరూరల్, జూలై 3: పుట్టపర్తి నియోజకవర్గ అభివృద్ధికి ఆర్డీటీ సంస్థ ద్వారా తగిన సహకారం ఇవ్వాలని ఆర్డీటీ మహిళా సాధికారత విభాగం డైరెక్టర్ విశాలఫెర్రర్‌ను ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి కోరారు. ఆ మేరకు బుధవారం రాత్రి పీవీకేకే విద్యాసంస్థల చైర్మన్ పల్లె కిశోర్‌రెడ్డితో కలసి ఆర్డీటీ కార్యాలయంలో ఆమెను మర్యాదపూర్వకంగా ఆమె కలిశారు. పేద విద్యార్థులు, పేద మహిళల అభివృద్ధికి ఆర్డీటీ సంస్థ చేస్తున్న సేవలను ఎమ్మెల్యే కొనియాడారు. పేదల ఇందుకు విశాల ఫెర్రర్ సానుకులంగా స్పందించారు. బాలాజీ ఎంబీఏ కళాశాల ప్రిన్సిపాల్ సుబ్బారావు పాల్గొన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రాధాన్యం


మాట్లాడుతున్న సెర్ప్ డైరెక్టర్ సత్యభామ, పక్కనే డీఆర్‌డీఏ పీడీ ఈశ్వరయ్య

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 3: మహిళల ఆర్థికాభివృద్ధితోనే పేదరిక నిర్మూలన సాధ్యమవుతుందని, ఇందుకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని సెర్ప్ అధికారులు అన్నారు. ఉమ్మడి 13 జిల్లాల్లో సెర్ప్ అధికారులకు కమ్యూనిటీ నిర్వహణ కేంద్రాల ఏర్పాటు, మహిళా ఆర్థిక స్వాలంబనపై రాష్ట్రస్థాయి శిక్షణ కార్యక్రమం బుధవారం మహిళాసమాఖ్య కార్యాలయంలో నిర్వహించారు. సెర్ప్ డైరెక్టర్ సత్యభామ, డీఆర్‌డీఏ పీడీ ఈశ్వరయ్య మాట్లాడుతూ మహిళా సంఘాల నిర్వహణలో, ఆర్థిక అక్షరాస్యత సాధించడంలో జిల్లా దేశానికే మోడల్‌గా నిలిచిందని అన్నారు. మహిళల ఆర్థిక సాధికారత కు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందన్నారు. సంఘం స్థాయి నుంచి మండల, జిల్లా, రాష్ట్రస్థాయిలో డ్వాక్రా సంఘాల సంస్థాగత నిర్మాణం బలోపేతం చేయాలన్నారు. జిల్లా స్ఫూర్తితో రాష్ట్రంలో, దేశంలోని వివిధ ప్రాంతాల్లో మహిళల్లో చైతన్యం, అవగాహన కల్పించాలని సూచించారు. మహిళాసమాఖ్య జిల్లా అధ్యక్షురాలు తిప్పమ్మ, కోశాధికారి హేమలత, డీపీఎంలు, ఏపీఎంలు, డ్వాక్రా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

ప్రీ స్కూల్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే


స్కూల్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి

అనంతపురం విద్య, జూలై 3: నగరంలోని రాంనగర్‌లో నూతనంగా ఏర్పాటుచేసిన ఆల్ఫాబెట్ స్కూల్‌ను ఎమ్మెల్యే దగ్గుబాటి వెంకట ప్రసాద్ ప్రారంభించారు. నూతన స్కూల్ ప్రారంభోత్సవానికి బుధవారం ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆయన రిబ్బన్ కట్ చేసి ఆల్ఫాబెట్స్ యూకె కాన్సెప్ట్ ఇంటర్నేషనల్ ప్రీస్కూల్‌ను ప్రారంభించారు.

నీళ్ల పప్పును విద్యార్థులు ఎలా తింటారు?

● కేజీబీవీ సిబ్బందిపై త్రిసభ్య కమిటీ ఆగ్రహం


విద్యార్థులకు వడ్డిస్తున్న భోజనాన్ని పరిశీలిస్తున్న త్రిసభ్య కమిటీ సభ్యులు

శింగనమల జూలై 3: మీ బిడ్డలకు నీళ్ల పప్పు వేస్తారా అంటూ శింగనమల కేజీబీవీ పాఠశాల వంట ఏజెన్సీ సిబ్బందిపై మండల త్రిసభ్యకమిటీ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం శింగనమల కేజీబీవీని సభ్యులు తహసీల్దార్ శోభన్‌బాబు, ఎంపీడీవో వెంకటరమణ, ఎంఈఓ నరసింహరాజు శివప్రసాద్ ఆకస్మిక తనిఖీ చేశారు. విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. అన్నం ముద్దముద్దగా, పప్పు నీళ్లగా ఉండటం, మజ్జిగ లేకపోవడంతో సిబ్బందిపై మండిపడ్డారు. ముఖ్యంగా మజ్జిగ ఎందుకు లేవని సిబ్బందిని ప్రశ్నించగా పాలలో తోడు వేయలేదని నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చారు. పాఠశాలలో మోను ప్రకారం భోజనం అందజేస్తున్నారా లేదా అనే కోణంలో విద్యార్థులను రహస్యంగా విచారించారు. విద్యార్థులు చెప్పిన మేరకు ఉన్నతాధికారులకు నివేదిక పంపుతామన్నారు.

విశ్రాంత సీఈ శ్రీనివాసరెడ్డి సేవలు స్ఫూర్తిదాయకం


విశ్రాంత సీఈ శ్రీనివాసరెడ్డిని సన్మానిస్తున్న హంద్రీనీవా ఎస్ఈ, ఈఈలు

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 3: నిస్వార్థ సేవలందించిన జలవనరుల శాఖ సీఈ శ్రీనివాసరెడ్డి అందరికీ స్ఫూర్తిదాయకమని హంద్రీనీవా సుజల స్రవంతి పథకం ఎస్ఈ దేసేనాయక్ అన్నారు. బుధవారం స్థానిక హెచ్చెల్సీ కాలనీలోని జలవనరుల శాఖ కార్యాలయంలో పదవీవిరమణ పొందిన సీఈ శ్రీనివాసరెడ్డికి సన్మానసభ ఏర్పాటు చేశారు. శాలువ, పుష్పగుచ్ఛం ఇచ్చి సీఈని ఇంజనీర్లు సత్కరించారు. దేసేనాయక్ మాట్లాడుతూ రెండేళ్లుగా జిల్లాలో మైనర్ ఇరిగేషన్ ఎస్ఈగా, జలవనరుల శాఖ సీఈగా శ్రీనివాసరెడ్డి సేవలందించారని గుర్తు చేశారు. కార్యక్రమంలో కర్నూలు హంద్రీనీవా ఎస్ఈ రామ్‌గోపాల్, ఈఈలు రాజా స్వరూప్‌కుమార్, మురళీ, శ్రీనివాస నాయక్ పాల్గొన్నారు.

వైసీపీ కౌన్సిలర్లు టీడీపీలో చేరిక


టీడీపీలోకి చేరిన వారితో ఎమ్మెల్యే అమిలినేని

కళ్యాణదుర్గం, జూలై 3: పట్టణంలోని వైసీపీ కౌన్సిలర్లు ఆ పార్టీకి గుడ్‌బై చెప్పి టీడీపీలోకి చేరారు. పట్టణంలో బుధవారం వారందరూ ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు ఆధ్వర్యంలో చేరారు. వారికి ఎమ్మెల్యే కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ తిమ్మప్పతో పాటు 13వ వార్డు కౌన్సిలర్ గంగమ్మ, 17వ వార్డు కౌన్సిలర్ పాలా రాజేశ్వరి, 18వ వార్డు కౌన్సిలర్ మహాలక్ష్మీ వైసీపీని వీడి టీడీపీలోకి చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మనందరి ధ్యేయం కళ్యాణదుర్గం నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపించడమేనన్నారు. అందుకోసం నిరంతరం కృషి చేద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తల పాల్గొన్నారు.

అమిలినేని చిత్రపటానికి క్షీరాభిషేకం

కళ్యాణదుర్గం: ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు ఆధ్వర్యంలో ఉచిత డీఎస్సీ కోచింగ్ సెంటర్ ఏర్పాటుపై హర్షం వ్యక్తం చేస్తూ నిరుద్యోగుల ఐక్యవేదిక వారు ఆయన చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. పట్టణంలోని టీ సర్కిల్ వద్ద నిరుద్యోగుల ఐక్యవేదిక అధ్యక్షుడు టీపీ రామన్న ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా రామన్న మాట్లాడుతూ సుమారు వెయ్యి మందికి పైబడి నియోజకవర్గంలో ఉచితంగా డీఎస్సీ శిక్షణ అమిలినేని సురేంద్రబాబు నిర్వహించడం హర్షించదగ్గ విషయమన్నారు. అవకాశాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నిరుద్యోగ ఐక్యవేదిక నాయకులు, విద్యార్థి సంఘం నాయకులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ సమస్యలను పరిష్కరించాలని వినతి

కళ్యాణదుర్గం: అంగన్‌వాడీ కార్యకర్తల సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబుకు అంగన్‌వాడీ కార్యకర్తలు, సీఐటీయూ నాయకులు వినతిపత్రం అందజేశారు. సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు అచ్యుత్ ప్రసాద్ , అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు శకుంతల, కార్యదర్శి రమాదేవి ఆధ్వర్యంలో పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. జీవో నెంబర్ 17 మార్పు చేయాలని, మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్పు చేయాలని, అంగన్‌వాడీలకు సొంత భవనాలు నిర్మించాలని కోరారు. కళ్యాణదుర్గం ప్రాజెక్టు కార్యదర్శి పాతక్క, సెక్టార్ లీడర్లు తిప్పేరమ్మ, రాధ, విజయనిర్మల, దాక్షాయణి, సువర్ణ, లక్ష్మీ, వరలక్ష్మి, సుధామణి, అపర్ణ, భాగ్యమ్మ తదితరులు వినతిపత్రం అందించిన వారిలో ఉన్నారు.

రాహుల్ గాంధీ సభ్యత్వం రద్దు చేయాలి

గుంతకల్లుటౌన్, జూలై 3: బీజేపీ వాళ్లు హిందువులే కాదని లోక్‌సభలో కాంగ్రెస్ పార్టీ విపక్ష నేత రాహుల్ గాంధీ అనుచిత వ్యాఖ్యలు చేశారని, వెంటనే ఆయన సభ్యత్వాన్ని రద్దు చేయాలని వీహెచ్‌పీ, బజరంగ్‌దళ్ నాయకులు డిమాండ్ చేశారు. పట్టణంలో బుధవారం వారు సమావేశమై మాట్లాడారు. హిందువులు ఎప్పుడూ హింస చేస్తుంటారని, అసత్యాన్ని పలుకుతుం టారని, తీవ్రమైన మతవిద్వేషాన్ని కలిగి ఉంటారని రాహుల్ గాంధీ మాట్లాడటం ఆయన తెలివి తక్కువ తనానికి నిదర్శనమన్నారు. హిందువుల పట్ల అనుచితమైన వ్యాఖ్యలు మంచి పద్ధతి కాదన్నారు. సమావేశంలో బజరంగ్‌దళ్ రాష్ట్ర నాయకుడు కసాపురం రవి, పట్టణ సేవా ప్రముఖ్ బండిమురళి, గోరక్షప్రముఖ్ రంగస్వామి, సహసేవ ప్రముఖ్ నారాయణరెడ్డి, బీజేపీ నాయకులు బండారుకృష్ణమూర్తి, విజయలక్ష్మి, గుర్రం సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

శ్మశాన వాటికకు రోడ్డు సౌకర్యం

బెళుగుప్ప, జూలై 3: మండల కేంద్రంలో కూటమి హయాంలో అభివృద్ధికి తొలి అడుగుపడింది. శ్మశానవాటికలోకి వెళ్లడానికి రోడ్డు సౌకర్యం లేక కొన్నేళ్లుగా గ్రామస్థులు ఇబ్బంది పడుతుండేవారు. ఎన్నికల ప్రచారంలో గ్రామస్థులు సమస్యను పయ్యావుల కేశవ్ దృష్టికి తీసుకెళ్లారు. అధికారంలోకి రాగానే పరిష్కరిస్తానని అప్పుడు ఆయన హామీనిచ్చారు. ఇప్పుడు మంత్రి అయ్యాక సమస్య పరిష్కారానికి ఆదేశించారు. ఆయన ఆదేశాల మేరకు స్థానిక టీడీపీ నాయకులు పెద్ద తిప్పయ్య, మల్లికార్జున రోడ్డు పనులు చేపట్టడానికి చర్యలు తీసుకున్నారు. సుమారు ఐదు ఎకరాలున్న శ్మశాన వాటికలో కంపచెట్లు పెరిగి కాలినడకన కూడా వెళ్లడానికి వీలుకాని విధంగా పరిస్థితి వుండేది. గత నాలుగు రోజుల నుంచి టీడీపీ నాయకులు మట్టి రోడ్లు వేయిస్తున్నారు. ఆ పనులను బుధవారం వారు పరిశీలించారు. అక్కడ మొక్కలు నాటడంతో పాటు అంత్యక్రియలు అనంతరం స్నానం చేయడానికి షెడ్ నిర్మించడానికి చర్యలు తీసుకుంటున్నట్లు టీడీపీ నాయకులు తెలిపారు.

కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

గుత్తి, జూలై 3: ఏపీ ఎలక్ట్రికల్ సిటీలో పనిచేస్తున్న కార్మికుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని ఏపీ ఎలక్ట్రికల్ సిటీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పొన్నా శివయ్య కోరారు. పట్టణంలోని ఏఐటీయూసీ కార్యాలయంలో బుధవారం ఆయన గుత్తి డివిజన్ యూనిట్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యుత్ సంస్థల్లో కార్మికుల సంఖ్య పెంచకపోవడంతో ఉన్నవారిపై పని భారం పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. కావున కార్మికుల సంఖ్యను పెంచాలని డిమాండ్ చేశారు. అదే విధంగా కార్మికులకు భద్రతకు సంబంధించి పరికరాలను వెంటనే అందించాలన్నారు. బిల్లులు వసూలు చేసే కార్మికులపై అధికారులు ఒత్తిడి విడనాడాలన్నారు. అనంతరం గుత్తి డివిజన్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎస్‌ఎం బాషా, ప్రధాన కార్యదర్శిగా అక్బర్, ఉపాధ్యక్షుడిగా హాజీ బాషా, సహాయ కార్యదర్శిగా ఖాదర్‌బాషా, కోశాధికారిగా ఫయాజ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

జీబీసీ ప్రహరీని మరమ్మతు చేయండి

గుంతకల్లు టౌన్, జూలై 3: పట్టణంలోని ఆలూరు రోడ్డులో గల సీపీఐటీయూ కాలనీలో కుంగిపోయిన జీబీసీ కాలువ ప్రహరీకి వెంటనే మరమ్మతులు చేపట్టాలని పట్టణ పౌరుల సంఘం కన్వీనర్ మారుతిప్రసాద్ కోరారు. కుంగిపోయిన జీబీసీ కాలువ ప్రహరీని బుధవారం ఆయన సంఘం సభ్యులతో కలిసి పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. 15రోజుల క్రితం వర్షాల కారణంగా జీబీసీ కాలువ ప్రహరీ కుంగిపోయిందన్నారు. అధికారులు వెంటనే మరమ్మతులు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో సంఘం చంద్రశేఖర్, ఓబులేసు, అబ్దుల్లా, షాషా, ఖాదర్, రాము, రాజు తదితరులు పాల్గొన్నారు.

వెల్ఫేర్ అసిస్టెంట్ సస్పెన్షన్

కళ్యాణదుర్గం(శెట్టూరు), జూలై 3: శెట్టూరు గ్రామ సచివాలయంలో వెల్ఫేర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న ఎస్.మల్లికార్జునను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు ఎంపీడీఓ నరసింహమూర్తి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పింఛన్‌దారులకు అందించాల్సిన పింఛన్ సొమ్ము రూ.5.45 లక్షలను అతను వ్యక్తిగత అవసరాలకు వాడుకున్నారని, అందుకు గాను ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సస్పెండ్ చేసినట్లు ఎంపీడీఓ పేర్కొన్నారు.

విద్యార్థినులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలి


బాలికల హాస్టల్‌లో రికార్డులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

రాయదుర్గం రూరల్, జూలై 3: బాలికల వసతి గృహాల్లో విద్యార్థినులకు మెరుగైన వసతులు కల్పించాలని, లేకపోతే చర్యలు తప్పవని ఎంపీడీఓ అల్లా బకాష్, ఎంఈఓ వెంకటరమేష్ హెచ్చరించారు. పట్టణంలోని దాసప్పరోడ్‌లో ఉన్న వెనుకబడిన తరగతుల బాలిక వసతి గృహాన్ని ఎంపీడీఓ అల్లాబకాష్, ఎంఈఓ వెంకటరమేష్ బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అక్కడి రికార్డులను పరిశీలించారు. విద్యార్థులకు కేటాయించిన వసతులు గురించి వార్డెన్‌ను అడిగి తెలుసుకున్నారు. మౌలికవసతులు విద్యార్థినులకు అనుగుణంగా ఉండే విధంగా చూడాలని ఆదేశించారు. వసతిగృహంలో ఏమైనా ఇబ్బందులు ఉంటే అధికారుల దృష్టికి తీసుకురావాలని విద్యార్థులకు సూచించారు.కార్యక్రమంలో వార్డెన్ లలితకుమారి ఉన్నారు.

బీసీ బాలుర హాస్టల్ తనిఖీ

గుంతకల్లుటౌన్: పట్టణంలోని పాత గుంతకల్లులో గల విజ్ఞాన్ పాఠశాల ఆవరణలో ఉన్న బీసీ బాలుర హాస్టల్‌ను బుధవారం సాయంత్రం మున్సిపల్ కమిషనర్ వెంకటరమణయ్య తనిఖీ చేశారు. హాస్టల్‌లో సమస్యలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. భోజనం, తాగునీటి వసతిని పరిశీలించారు. కార్యక్రమంలో మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారి సత్తార్ తదితరులు పాల్గొన్నారు.

కళ్యాణదుర్గం: పట్టణంలోని దొడగట్ట రోడ్డులో ఉన్న బీసీ బాలుర హాస్టల్‌ను మున్సిపల్ కమిషనర్ బీవీ నరసారెడ్డి బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. హాస్టల్‌లోని గదులను, మరుగుదొడ్లను, స్నానపు గదులను పరిశీలించారు. అలాగే హాస్టల్ రికార్డులను పరిశీలించి స్టోర్ రూమ్‌ను తనిఖీ చేశారు. భోజన వసతులు ఎలా వున్నాయని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. వార్డెన్ అందుబాటులో వుంటున్నారా లేదా అని ఆరా తీశారు. అనంతరం వార్డెన్‌కు పలు సూచనలు అందించారు. వార్డెన్ అశ్వర్థ తదితరులు ఉన్నారు.

హామీలన్నీ తప్పక నెరవేరుస్తా

● ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డి

యాడికి, జూలై 3: రెండునెలల సమయం ఇవ్వండి, ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నింటినీ ఖచ్చితంగా నెరవేరుస్తానని ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డి తెలిపారు. మండలకేంద్రంతో పాటు గుడిపాడు గ్రామంలో బుధవారం ఆయన పర్యటించారు. ఎమ్మెల్యే అయిన తర్వాత మొదటిసారి యాడికికి వచ్చిన అశ్మిత్‌రెడ్డికి ప్రజలు ఘన స్వాగతం పలికారు. చెన్నకేశవస్వామి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఎమ్మెల్యేగా తనను గెలిపించిన ప్రజలందరికి ధన్యవాదాలు తెలిపారు. రెండునెలల సమయం ఇవ్వండి, ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని తప్పక నెరవేరుస్తానని తెలిపారు. అభివృద్ధే తన అజెండా అని, మండలంలో ఎక్కడా తాగునీటి సమస్య లేకుండా చేస్తానని అన్నారు. యాడికిలో లక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయ భూములు అన్యాక్రాంతమయ్యాయని, వాటిని తిరిగి స్వామి వారికే చెందేలా చేసే బాధ్యత తనదని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ రుద్రమనాయుడు, మాజీ ఎంపీపీ వేలూరు రంగయ్య, తెలుగుయువత జిల్లా ఆర్గనైజింగ్ సెక్రెటరీ పరిమి చరణ్, నాయకులు నీలకంఠ, చలమారెడ్డి, విశ్వనాథ్, ఆదినారాయణ, నాగమునిరెడ్డి, మాదాల అనిల్, రామకృష్ణ, నాగిరెడ్డి, తదితరులు ఉన్నారు.

మొక్కల పెంపకంతోనే పర్యావరణ పరిరక్షణ


యాడికిలో మొక్కలు నాటుతున్న నాయకులు

యాడికి, జూలై 3: మండలకేంద్రంలో టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలన్నారు. అప్పుడే పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో ఆయా పార్టీల కన్వీనర్లు రుద్రమనాయుడు, సునీల్‌కుమార్, చౌడయ్య, మాజీ ఎంపీపీ వేలూరు రంగయ్య, నాయకులు పరిమి చరణ్, గంగాధర్, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటిన బీజేపీ శ్రేణులు

తాడిపత్రి: ప్రధాని నరేంద్రమోదీ ప్రవేశపెట్టిన అమ్మకు వందనం కార్యక్రమంలో భాగంగా పట్టణంలో బుధవారం బీజేపీ శ్రేణులు మొక్కలు నాటారు. స్థానిక సీబీరోడ్డులో నాయకుడు అంకాల్‌రెడ్డి కార్యకర్తలతో కలిసి మొక్కలు నాటారు. అనంతరం మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ అమ్మపేరు మీద మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు శింగరి లక్ష్మీనారాయణ, పట్టణ అధ్యక్షుడు ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శి కృష్ణమోహన్, నాయకులు పాల్గొన్నారు.

ప్రతిగ్రామంలోనూ మొక్కలు నాటాలి

బొమ్మనహాళ్: ప్రతి గ్రామంలో మొక్కలను నాటాలని తహసీల్దార్ రామాంజినమ్మ, ఎస్‌ఐ శ్రీనివాసులు సూచించారు. మండల కేంద్రంలో టీడీపీ నాయకుడు పయ్యావుల అనిల్ ఆధ్వర్యంలో బుధవారం మొక్కలు నాటే కార్యక్రమం జరిగింది. ఇందులో తహసీల్దార్, ఎస్‌ఐ ముఖ్య అతిథులుగా పాల్గొని మొక్కలు నాటారు. అనంతరం మాట్లాడుతూ ప్రతిగ్రామంలో మొక్కలు నాటాలని, అనంతరం రోజూ వాటికి నీరు పోసి సంరక్షించాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఓ ఈరన్న, హెచ్‌ఎం రాజుకుమార్, ఏపీఓ రమేష్, ఈసీ రాజేష్‌కుమార్, టీడీపీ నాయకులు లాలూస్వామి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రైతుబజార్‌ను ఏర్పాటు చేయాలని వినతి

తాడిపత్రి, జూలై 3: పట్టణంలో రైతుబజారును ఏర్పాటు చేయాలని సీపీఐ, రైతు సంఘం నాయకులు బుధవారం వ్యవసాయశాఖ ఏఓకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటరాముడు, సీపీఐ పట్టణ కార్యదర్శి చిరంజీవియాదవ్ మాట్లాడుతూ.. పట్టణ ప్రజలే కాక పరిసర మండలాల నుంచి పెద్దఎత్తున ప్రజలు నిత్యావసర సరుకులు కొనుగోలు చేయడానికి పట్టణానికి వస్తుంటారన్నారు. కూరగాయల ధరలు ఆకాశాన్ని అంటుతుండడంతో సామాన్య ప్రజలు కొనలేని పరిస్థితి ఉందన్నారు. చుట్టుపక్కల ప్రాంతాల రైతులు పండించిన కూరగాయలు విక్రయించడానికి ఆటోల్లో రోడ్లమీద అవస్థలు పడుతున్నారన్నారు. జిల్లాలోని అన్ని మున్సిపాలిటీల్లో రైతుబజార్లు ఉన్నాయన్నారు. కావున తాడిపత్రిలో కూడా రైతుబజారును ఏర్పాటు చేయాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో ఏఐటీయూసీ నాయకులు శ్రీనివాసయాదవ్, రమణ, ఉమాగౌడ్, రత్నమయ్య, రామాంజనేయులు, రామాంజనేయయాదవ్, చిన్నసంజీవులు తదితరులు ఉన్నారు.

రిటైర్డ్ బీఎస్ఎఫ్ జవాన్ ఆత్మహత్య

ఉరవకొండ,జూలై 3: వజ్రకరూరు మండలం కొనకొండ్లలో రిటైర్డ్ బీఎస్ఎఫ్ జవాన్ ధనుంజయ(56) పశువుల షెడ్‌లో బుధవారం ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ధనుంజయ రిటైర్డ్ అయిన తర్వాత స్వగ్రామంలో వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. వ్యవసాయం కోసం చేసిన అప్పులు పెరిగిపోవడంతో గత కొంత కాలం నుంచి ఆర్థిక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నాడు. అప్పులు తీర్చే మార్గం లేక మనస్థాపానికి గురై ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకున్నాడు. కుటుంబసభ్యులు గమనించి కిందకు దించగా అప్పటికే మృతి చెందాడు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతుని భార్య శంకరమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గుంతకల్లు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

విద్యావ్యవస్థ బలోపేతమే కూటమి లక్ష్యం

కళ్యాణదుర్గంరూరల్, జూలై 3 : విద్యావ్యవస్థను బలోపేతం చేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు అన్నారు. పట్టణంలోని కరణం చిక్కప్ప ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు బుధవారం ఆయన పాఠ్యపుస్తకాలు, బ్యాగులు పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ విద్యాశాఖ మంత్రిగా నారా లోకేష్ విద్యార్థుల భవిష్యత్తుకు బంగారుబాటలు వేస్తారన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం గంధంనేని శ్రీనివాస్, ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

ప్రీమియర్ లీగ్ ప్రారంభిస్తాం

కళ్యాణదుర్గం, జూలై 3 : కళ్యాణదుర్గం నియోజకవర్గంలో యువత కోసం ప్రీమియర్ క్రికెట్ లీగ్ ప్రారంభిస్తామని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు అన్నారు. యువతలో క్రీడానైపుణ్యాన్ని వెలికితీసేందుకు ఈ లీగ్‌లు నిర్వహిస్తామన్నారు. ఇందుకు కళ్యాణదుర్గంలో ప్రజావేదిక వద్ద బుధవారం నుంచి రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభమైందన్నారు. ఆసక్తి గల క్రికెట్ క్రీడాకారులు పేర్లు నమోదు చేసుకోవచ్చన్నారు. మొదటి బహుమతి కింద రూ. 2 లక్షలు నగదు, రెండో బహుమతి కింద రూ. లక్ష, మూడో బహుమతిగా రూ. 50 వేలు అందజేస్తామన్నారు. ఫొటోలు, ఆధార్ కార్డులు తప్పనిసరిగా తీసుకువచ్చి రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 8790123265, 7780543388, 9986119992 కు సంప్రదించాలన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు

కళ్యాణదుర్గంరూరల్, జూలై 3 : పట్టణంలోని వాల్మీకి సర్కిల్‌లో బైక్‌ను బొలెరో వాహనం ఢీకొట్టడంతో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. కనుకూరు గ్రామానికి చెందిన శ్రీరాములు తన కుమార్తె నిఖితతో కలిసి బైక్‌లో పట్టణానికి వస్తున్నారు. వాల్మీకి సర్కిల్‌లోకి రాగానే బొలెరో వాహనం ఢీకొంది. ప్రమాదంలో శ్రీరాములు తలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే అతనిని స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించగా పరిస్థితి విషమంగా వుండటంతో అనంతపురంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వైసీపీ ధర్నాకు, మాకు సంబంధం లేదు

● ఆ పార్టీ మైనార్టీ నాయకులు

ఉరవకొండ,జూలై 3: మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి , ఆయన తనయుడు ప్రణయ్ రెడ్డి మైనార్టీలను మోసం చేశారని వైసీపీ మైనార్టీ నాయకులు పేరిటే సోషల్‌మీడియాలో పోస్టు రావడం చర్చనీయాంశంగా మారింది. తమపై టీడీపీ వారు దాడులు చేస్తున్నారంటూ పట్టణంలో గురువారం విశ్వేశ్వర రెడ్డి ధర్నా చేపట్టనున్నారని, అయితే ఆ ధర్నాకు, మాకు ఎలాంటి సంబంధం లేదని వారు ఆ పోస్టులో పేర్కొన్నారు. మమ్మల్ని టీడీపీ నాయకులు బెదిరిస్తున్నారనేది అవాస్తవమన్నారు. రాజకీయ లబ్ధికోసం, తన స్వార్థ ప్రయోజనాలకోసమే విశ్వేశ్వరరెడ్డి ధర్నా చేపట్టనున్నారన్నారు. అందులో మేమెవరూ పాల్గొనమని వారు ఆ పోస్టులో స్పష్టం చేశారు.

ఇద్దరి బైండోవర్

బొమ్మనహాళ్, జూలై 3: మండలం నుంచి రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలించే వారిని బైండోవర్ చేసినట్లు ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు. కర్ణాటకలోని బొమ్మదరపల్లికి చెందిన సురేష్‌తో పాటు మరో మహిళ రేషన్ బియ్యాన్ని అక్రమంగా ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారని ఆరోపణలు రావడంతో వారిని బుధవారం తహసీల్దార్ రామాంజినమ్మ ఎదుట హాజరు పరచి బైండోవర్ చేసినట్లు చెప్పారు. మరోసారి బియ్యంతో పట్టుబడితే ఆరునెలలు జైలు శిక్ష, రూ. లక్ష జరిమానా ఉంటుందని హెచ్చరించినట్లు తెలిపారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలని వినతి

గుత్తిరూరల్, జూలై 3 : జిల్లా వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న ఉపాధి పనుల బిల్లులు వెంటనే చెల్లించాలని జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం నాయకురాలు నిర్మల డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం పట్టణంలో ఎంపీడీఓ శ్రీనివాసులు, ఈఓఆర్డీ శివాజీరెడ్డికి వినతి పత్రం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ ఎనిమిది వారాల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని వెంటనే చెల్లించాలని కోరారు.

చిరుత సంచారంతో స్థానికుల భయాందోళన

రాయదుర్గంరూరల్, జూలై 3: పట్టణంలోని మారెమ్మ గుడి ఏరియా లో నరసోజికుంట వద్ద చిరుత సంచరించడంతో స్థానికులు భయాందోళన వ్యక్తం చేశారు. మంగళవారం రాత్రి 11.30 గంటలకు కొండవైపు నుంచి చిరుత వచ్చి ముళ్లపొదల వద్ద సంచరిస్తున్నట్లు స్థానికుడు గంగాధర్ బుధవారం పేర్కొన్నారు. పశువులపాకలోని దూడల కోసం చిరుత వచ్చిందని, కుక్కలు వెంటపడి అరవడంతో తాను లేచి చూసి కేకవేయడంతో ముళ్లపొదళ్లలోకి పోయిందని అన్నారు. అటవీ అధికారులు తగుచర్యలు తీసుకోవాలని కోరారు. అటవీఅధికారులు ఘటన స్థలాన్ని పరిశీలించి నిఘా ఏర్పాటు చేసినట్లు అసిస్టెంట్ బీట్ ఆఫీసర్ ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

ఉద్యోగుల ఆనందం

● వేతనాలు సకాలంలో అందడంతో హర్షం

బెళుగుప్ప, జూలై 3 : గత వైసీపీ ప్రభుత్వంలో వేతనాలు సకాలంలో అందక ఉద్యోగులు నానా అవస్థలు పడ్డారు. బ్యాంకుల్లో గృహ రుణాలు పొందినవారు కంతులు కట్టలేక ఇతరులతో అప్పులు చేసి చెల్లించేవారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం 1వ తేదీన ఉద్యోగులకు వేతనాలు బ్యాంకులో జమ చేయడంతో వారి ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. వైసీపీ ప్రభుత్వంలో ప్రతి నెలా పదో తేదీ పైనే వేతనాలు జమ అవుతుండేవి. ప్రస్తుతం సీఎం చంద్రబాబు సమయానికి వేతనాలు వేశారని, ఎన్నికల్లో ఇచ్చిన హామీని నిలుపుకున్నారని, ఉద్యోగులు ఆనందం వ్యక్తం చేస్తూ సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు.

వైసీపీ హయాంలో ఇబ్బంది పడ్డాం



వైసీపీ ప్రభుత్వంలో వేతనాలు సకాలంలో అందక గతంలో ఎంతో ఇబ్బంది పడ్డాం. ఇతరులతో అప్పులు తెచ్చి సమస్యలు తీర్చుకునేవారం. కూటమి ప్రభుత్వం రాగానే 1వ తేదీనే ఉద్యోగులకు వేతనాలు బ్యాంకులలో జమ చేస్తామని చంద్రబాబు ఎన్నికల్లో హామీ ఇచ్చారు. చెప్పినట్టుగానే సమయానికి వేతనాలు జమ చేశారు. ఇందుకు సీఎంకు ప్రత్యేక కృతజ్ఞతలు.

- ఉప్పర శ్రీనివాసులు, ఉపాధ్యాయుడు, బెళుగుప్ప

శుభ పరిణామం



సీఎం చంద్రబాబు ప్రభుత్వ ఉద్యోగులందరికీ 1వ తేదీన వేతనాలు జమ చేయడం శుభపరిణామం. రాష్ట్రంలో ఆర్థిక ఇబ్బందులు ఉన్నా.. ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో సమయానికి వేతనాలు వచ్చేవి కావు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీని నిలబెట్టుకోవడం హర్షణీయం.

- సత్యవతి, అంగన్‌వాడీ యూనియన్ లీడర్, శ్రీరంగాపురం

కార్యకర్తలకు సముచితస్థానం కల్పిస్తాం

● ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం


ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే తదితరులు

పామిడి, జూలై 3 : సార్వత్రిక ఎన్నికల్లో సైనికుల్లా శ్రమించిన కార్యకర్తలకు సముచిత స్థానం కల్పిస్తామని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం పేర్కొన్నారు. మండలకేంద్రంలో కార్యకర్తల సమీక్షకు ఎమ్మెల్యే బుధవారం వచ్చారు. తొలుత స్థానిక పంచముఖ ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వాల్మీకి విగ్రహానికి పూలమాల వేసి కొబ్బరి కాయ కొట్టారు. ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం టీడీపీ కార్యాలయంలో గ్రామాల వారీగా ఎమ్మెల్యేతో పాటు గుమ్మనూరు ఈశ్వర్ కార్యకర్తలతో సమీక్షించారు. గ్రామీణ ప్రాంతాల్లో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. పార్టీ కోసం కష్టపడిన ప్రతిఒక్కరికీ సముచిత స్థానం కల్పిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి బొల్లు శ్రీనివాసరెడ్డి, గుత్తి మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ ప్రభాకర్ చౌదరి, విభిన్న ప్రతిభావంతుల జిల్లా అధ్యక్షుడు అప్పన్నగారి కుమార్, నాయకులు ఆర్‌ఆర్ రమేష్, జింకల సంజీవకుమార్, నల్లబోతుల శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

సార్.. శాలరీ ఇప్పించండి..

పామిడి: పట్టణంలోని సచివాలయాలలోని రెగ్యులర్ ఉద్యోగుల పరిస్థితి వర్ణనాతీతం. తమకు సుమారు సంవత్సరం నుంచి వేతనాలు రాకపోవడంతో ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాంకు బుధవారం వారు వినతిపత్రం అందజేసి గోడు వెళ్లబోసుకున్నారు. పామిడిని నగర పంచాయతీ నుంచి గ్రామ పంచాయతీగా మార్చడంతో దాదాపు 21 మంది సచివాలయం ఉద్యోగులకు ఏడాది నుంచి జీతాలు పడలేదన్నారు. మీరే ఎలాగైనా శాలరీలు ఇప్పించాలని ఆ ఉద్యోగులు వాపోయారు. స్పందించిన ఎమ్మెల్యే కలెక్టర్ వినోద్ కుమార్, డీపీఓ ప్రభాకర్‌తో ఫోన్‌లో మాట్లాడారు. జీతాలకు సంబంధించి నివేదికను అందజేస్తే రాష్ట్ర సచివాలయంలో సంబంధితాధికారులతో చర్చించి తక్షణం జీతాలు వచ్చేలా తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి


సిద్ధవటం నాగరాజు (ఫైల్)

రాయదుర్గం రూరల్, జూలై 3: పట్టణంలోని రాజీవ్‌గాంధీ కాలనీకి సమీపంలో ఉన్న కురాకుల గుట్ట వద్ద ఎరడుకేర గ్రామానికి చెందిన సిద్ధవటం నాగరాజు(65) అనుమానాస్పదంగా మృతి చెందాడు. మృతుడి బంధువులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. నాగరాజు మంగళవారం వ్యవసాయ పనిముట్లు కొనుగోలుకు రాయదుర్గం పట్టణానికి వెళ్లాడని, రాత్రి అయినా రాకపోవడంతో బుధవారం ఉదయమే రాయదుర్గం పట్టణంతో పాటు పరిసర ప్రాంతాలను గాలించామని, చివరకు కురాకులగుట్ట వద్ద మృతి చెందిన ట్లు గుర్తించామని తెలిపారు. మృతుడికి భార్య వనజాక్షి, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నట్లు చెప్పారు. పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ శ్రీనివాసులు తెలిపారు.

బాలికల చదువు దేశభవితకు వెలుగు

డీ.హీరేహాళ్, జూలై 3: బాలికల చదువు దేశభవితకు వెలుగని జిల్లా పరిషత్ సీఈఓ నిదియాదేవి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ డాక్టర్ శ్రీదేవి పేర్కొన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు.. మండలకేంద్రంలోని కేజీబీవీలో బుధవారం బాల్య వివాహాల నిర్మూలన, బాలికల హక్కు, పోక్సో చట్టం, చైల్డ్ హెల్ప్ లైన్ సర్వీసెస్ అంశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా తొలుత బాలికల హక్కులపై అవగాహన ర్యాలీని కేజీబీవీ విద్యార్థినుల చేత జరిపించారు. కేజీబీవీ పాఠశాల నుంచి బస్టాండ్ వరకు ర్యాలీ చేశారు. తర్వాత కేజీబీవీలో సదస్సు జరపగా జిల్లా పరిషత్ సీఈఓ, స్త్రీ శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. బాలికల చదువు దేశభవితకు వెలుగని, తల్లిదండ్రుడులు బాలికలను బాగా చదివించాలని తెలిపారు. అధికారులు గ్రామాలలో బాల్యవివాహాల నిర్మూలనకు కృషి చేయాలని సూచించారు. అనంతరం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో మొక్కలు నాటారు. చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ వెంకటేశ్వరి, తహసీల్దార్ బాలఈశ్వర్ రెడ్డి, ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డి, ఎంపీడీఓ రఘునాథ్ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ నాయకుడిపై కేసు నమోదు

కణేకల్లు, జూలై 3: మండలంలోని మారెంపల్లిలో వారం క్రితం టీడీపీ నాయకులు గొల్ల మారుతి, శీనప్పలపై దాడి జరిగింది. ఈ ఘటనలో రామన్న అనే వైసీపీ నాయకుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శ్రీనివాసులు బుధవారం తెలిపారు. ఈ ఘటనలో అప్పుడే ఆరుగురిపై కేసు నమోదు చేయగా .. తాజాగా రామన్నపై కూడా కేసు నమోదు చేసి కోర్టుకు ఎండార్స్ చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

చెన్నంపల్లిలో వైద్య బృందం పర్యటన

కళ్యాణదుర్గం (కంబదూరు), జూలై 3: కంబదూరు మండలంలోని చెన్నంపల్లిలో వైద్య బృందం బుధవారం పర్యటించారు. మూడేళ్ల బాలుడు అనారోగ్యంతో మృతి చెందడంతో డయేరియా మృతి చెందినట్లు అనుమానాస్పదంగా గుర్తించారు. అయితే వైద్య బృందం గ్రామానికి వెళ్లి పర్యటించి డయేరియాతో ఆ బాలుడు మృతి చెందలేదని, ఇతర వ్యాధితో మృతి చెందినట్లు తెలిపారు. డీఐఓ డాక్టర్ యుగంధర్, కంబదూరు వైద్యాధికారిణి ఆషియా, వైద్య సిబ్బంది బృందంగా ఏర్పడి చెన్నంపల్లిలోని కాలనీలలో పర్యటించారు. డయేరియాతో బాధపడుతున్న తొమ్మిదిమందిని గుర్తించారు. వీరందరికీ రక్తపరీక్షలు చేయడమే కాకుండా మెరుగైన వైద్యం కోసం కళ్యాణదుర్గం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. సూపర్‌వైజర్ హేమలత, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

అతిసార నివారణపై అవగాహన

బొమ్మనహాళ్: మండలంలోని గోనేహాళ్, ఉద్దేహాళ్ గ్రామాలలో బొమ్మనహాళ్, శ్రీధరఘట్ట ఆస్పత్రుల వైద్యసిబ్బంది అతిసారవ్యాధి నివారణపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఉద్దేహాళ్‌లో హెల్త్ అసిస్టెంట్లు గోవర్ధన్, ఆశావర్కర్లు ఇంటింటికీ తిరిగి సర్వే నిర్వహించి వ్యాధి లక్షణాలు ఉన్న వారిని గుర్తించి ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. అతిసారవ్యాధి కలుషితమైన నీరు, ఆహారం వల్ల వస్తుందని సూచించారు. వేడి నీటిని తాగాలని తెలియజేశారు.

డెంగీపట్ల అప్రమత్తంగా ఉండాలి

పెద్దపప్పూరు, జూలై 3: డెంగీపట్ల అప్రమత్తంగా ఉండాలని ఆరోగ్య పర్యవేక్షకులు శర్మాస్‌వలి పేర్కొన్నారు. మండలంలోని కేజీబీవీ పాఠశాలలో బుధవారం నిర్వహించిన డెంగీ వ్యతిరేక మహోత్సవంలో ఆయన మాట్లాడుతూ డెంగీ జ్వరం దోమల ద్వారా వ్యాప్తి చెందుతుందని తెలిపారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. దోమతెరలను ఉపయోగించి దోమల నుంచి రక్షణ పొందాలని ఆయన సూచించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

తాడిపత్రి, జూలై 3: మండలంలోని అర్జాస్‌స్టీల్ పరిశ్రమ సమీపంలో రెండురోజులక్రితం జరిగిన రోడ్డుప్రమాదంలో గాయపడ్డ అక్బర్ (30) చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడని రూరల్ పోలీసులు తెలిపారు. పట్టణంలోని గాంధీనగర్‌కు చెందిన అక్బర్, జాకీర్ అన్నదమ్ములు. అయితే ఈనెల 2వ తేదీన వారు బైక్‌లో బొందలదిన్నెకు వెళ్లి తిరిగి వస్తుండగా అర్జాస్‌స్టీల్ పరిశ్రమ సమీపంలో మట్టిదిమ్మెను తప్పించబోయి డివైడర్‌ను ఢీకొట్టారు. ప్రమాదంలో జాకీర్ అక్కడికక్కడే మృతిచెందగా.. అక్బర్ అనంతపురం ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. మృతుడికి భార్య అఫ్రీన్‌తోపాటు కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పోక్సో కేసులో నిందితుల అరెస్ట్

పుట్లూరు, జూలై 3: మండలంలోని ఓ గ్రామానికి చెందిన మైనర్ బాలికపై అత్యాచారానికి పాల్పడిన నిందితులను బుధవారం అరెస్టుచేసినట్లు ఎస్ఐ హేమాద్రి తెలిపారు. విచారణ నిమిత్తం నిందితులు రవితేజ, నాగేంద్రల కోసం గాలింపు చర్యలు చేపట్టగా మండలంలోని ఏ.కొండాపురం గ్రామశివారులో ఉండగా అరెస్టుచేసి రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు.

పీర్లచావిడి, నాగులకట్ట నిర్మాణానికి విరాళం

పెద్దవడుగూరు, జూలై 3: మండలంలోని చిన్నవడుగూరు గ్రామంలో పీర్లచావిడి, దళితవాడలో నాగులకట్ట నిర్మాణానికి తెలుగుయువత జిల్లా కార్యదర్శి దివాకర్‌రెడ్డి రూ.50 వేలు విరాళం ఇచ్చారు. ఆ మొత్తాన్ని గ్రామపెద్దలకు బుధవారం ఆయన అందించారు. అనంతరం మాట్లాడుతూ గ్రామస్థుల కోరిక మేరకు తన వంతు సాయం చేశానని చెప్పారు.

ఆసుపత్రికి వెళ్లి పింఛన్ పంపిణీ


ఆస్పత్రిలో పింఛన్ అందిస్తున్న సచివాలయ సిబ్బంది

డీ.హీరేహాళ్, జూలై 3: అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తికి అక్కడికే వెళ్లి సచివాలయ సిబ్బంది పింఛన్ పంపిణీ చేశారు. మండలంలోని సోమలాపురం గ్రామానికి చెందిన శివకుమార్ కొన్ని రోజులుగా బళ్లారి ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. దీంతో పింఛన్ పంపిణీకి గ్రామంలో అందుబాటులో లేదు. పంచాయతీ కార్యదర్శి రాజు ఎంపీటీసీ సభ్యుడు మొండి మల్లికార్జున బళ్లారిలోని ఆస్పత్రికే వెళ్లి అతడికి రూ. ఏడు వేలు పింఛన్ అందించారు.